POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
డిసెంబర్ 2022
వెల – ₹ 10.00

సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 40 సంచిక: 08

శ్రీ దత్త జయంతి, క్రిస్మస్, నూతన సంవత్సర సందర్భంగా 'సాయిబాబా' పాఠకులకు సకల శుభాలూ కలగాలని ఒక్కడే అయిన భగవంతునికి ప్రార్థన!

శ్రీ భరద్వాజ బృందావనం, ఒంగోలు

మత సామరస్యానికి మచ్చుతునక

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

శ్రీసాయిబాబా జీవితచరిత్రంతా మత సామరస్యానికి చక్కని మచ్చు తునక! గొప్ప ధృవతార! ఆయన ఒక మతానికి చెందక అన్ని మతధర్మాలకు చెందారు.

హిందువులవలె నిరతాగ్నిహోత్రము నిర్వహించారు. మసీదుకు 'ద్వారకామాయి' అని పేరుపెట్టి దాని ఎదుట తులసి ప్రతిష్టించారు. రామనవమి, గురుపూర్ణిమ వంటి పండుగలు జరుపుకొమ్మని మనని ప్రోత్సహించారు. విష్ణుసహస్రనామము, ఏకనాథ భాగవతము, జ్ఞానేశ్వరి, వివేకచూడామణి, భావార్థ రామాయణము, యోగవాసిష్ఠము వంటి గ్రంథాలు చదవమని హిందువులను ప్రోత్సహించేవారు. వారితో తమ గురువు 'వెంకూసా' అని చెప్పారు. హిందూధర్మానికి చెందిన శ్రీ నృసింహ సరస్వతి, అక్కల్కోట స్వామి, తపోవన సాధువు, గురుఘోలప్ మహారాజ్, ధునివాలా దాదా మహారాజ్ వంటి సిద్ధపురుషులు తమ రూపాలేనని నిరూపించారు. ఆయా దేవతలకు చేసుకున్న మొక్కులు నివేదనలు సమర్పించటం మరిస్తే, ఆ విషయం చెప్పి తీసుకొనడమో, ఆ భక్తుడు తమను పస్తుంచాడనో చెప్పేవారు. చెన్నబసప్ప, వీరభద్రప్ప అనే వెనుకటి భక్తులు ద్వేషము, అసూయల వలన పాము, కప్పలుగా ఎలా జన్మించారో వివరించారు. వెనుకటి తమ స్నేహితులు ద్వేషాల వలన ఈ జన్మలో రెండు మేకలుగా ఎలా జన్మించారో చెప్పారు. ఇలానే యింకా ఎందరి గురించో చెప్పి హిందూ, బౌద్ధ, జైన ధర్మాలకు కొమ్మయనదగిన పునర్జన్మసిద్ధాంతాన్ని ధృవపరచారు. వేదమంత్రం మరచిన దక్షిణాది బ్రాహ్మణులకు వేదమంత్రం గుర్తు చేశారు. భగవద్గీత శ్లోకానికి అద్వితీయమైన వివరణ యిచ్చారు. భజన, ఏకాహము, సప్తాహము వంటివాటిని భావయుక్తంగా చేసుకోమని భక్తులను ప్రోత్సహించేవారు. వారికి తీవ్రంగా జబ్బు చేసినప్పుడు ఆరోగ్యం కోసం భక్తులు శాంతులు, అభిషేకాలు, పూజలు చేయిస్తే అంగీకరించారు. భక్తులు తమ హైందవ ఆచారము ప్రకారము చందనమద్ది ధూపదీపాలతో పూజిస్తే అంగీకరించారు. తమ అవసానదశలో 'రామ విజయము' అనే గ్రంథం చదివించుకుని శ్రద్ధగా విన్నారు. వారి చెవులకు హిందువుల వలే చిల్లులుండేవి.

శ్రీ సాయిబాబా తమను గురించి ఈ 'పేదఫకీరు' అని వ్యవహరించేవారు. మీసం, గడ్డం, తల ఆ పద్ధతి లోనే క్షౌరము చేయించుకునేవారు. ముస్లిం భక్తులు నివేదనలు తెచ్చినప్పుడు ముస్లిం సాంప్రదాయం ప్రకారం ఫాతిహా చదివించడమో, చదవడమో చేసేవారు. ఖురాన్ మంత్రాలకు సరయిన అర్థం ఫకీర్లకు, హాజీ సిద్దిక్ వంటి పండితులకు బోధించేవారు. ముస్లింలతో కలిసి రాత్రి సమయాలలో

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:40 డిసెంబర్-2022 సంచిక:08

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

విషయ సూచిక

01.	**మత సామరస్యానికి మచ్చుతునక**	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	03
02.	**పరిప్రశ్న**	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	06
03.	**తల్లికి తగిన బిడ్డడు- మహాత్ముల ముద్దు బిడ్డడు**	పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ	07
04.	**మాతృదేవి స్మృతులు**	శ్రీమతి జయసుధ	10
05.	**వార్తాలాపము**	శ్రీమతి అడిదం వేదవతి	12
06.	**శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు**	శ్రీమతి శ్రీదేవి	16
07.	**భక్తవత్సలుడు**	శ్రీమతి మల్లాది సుబ్బలక్ష్మి	19
08.	**సపత్నేకర్**	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	22
09.	**మహాయోగి శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రి గారు**	శ్రీమతి శ్రీదేవి	23
10.	**ద్వారకామాయి అనుభవమండపము**	శ్రీ నరేష్ రావులపల్లి	25
11.	**ఆచార్యుని అద్భుత లీలలు**	శ్రీమతి కోటేశ్వరి	27

చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

www.saibharadwaja.org
www.saimasterforums.org

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి	:	రూ. 10-00
సంవత్సర చందా	:	రూ. 100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

తాకియాకు వెళ్లి కాళ్ళకు గజ్జులుకట్టి అరబ్బీ, ఫార్సీ భాషలలో పాటలు పాడేవారు. రంజాన్ వంటి ముస్లిం పండుగలు, ఉరుసువంటి వేడుకలు జరుపుకొమ్మని ముస్లిం భక్తులను ప్రోత్సహించేవారు. ముస్లిం ఫకీర్లు, మహనీయులు ఎందరో ఆయనను తమ తమ సాంప్రదాయానికి చెందిన శ్రేష్ఠుడైన మహనీయుడుగా పరిగణించి, తమ ముస్లిం శిష్యులను ఆయన దర్శనానికి పంపేవారు. అట్టి వారికి సాయి తానే గురువై వారిని ఉత్తమ దశకు తీసుకొచ్చారు. ముస్లింలతో తమ గురువు పేరు 'రోషన్ షా' అని చెప్పారు. తమ నిర్యాణానికి ముందు ఔరంగాబాదులోని షంషుద్దీన్ మియా, బన్నేమియా అనే ఫకీర్లకు కబురు చేసి ముస్లిం సాంప్రదాయానుసారం మౌలు, ఖవ్వాలీలు పాడించి, నియాజ్(అన్నదానము)చేయించారు. అల్లాను నిరంతరము స్మరించేవారు. ఏకాంతంగా వున్నప్పుడు అరబ్బీ మంత్రాలు గొణుగుతుండేవారు. కానీ అదంతా హిందువులకు, పార్సీలకు పరమ పవిత్రమైన అగ్ని ఎదుట నిలచి చేసేవారు.

ఇంతకూ తమ మతమేమని అడిగిన ధూలియా కోర్టు వారితో 'కబీరు' అని, తమ కులం 'దైవం' అని చెప్పారు.

ఒక క్రైస్తవుడిని యితర మతాలకు చెందిన భక్తులు నిందిస్తూంటే, "అతడిని దూషించవద్దు. అతడు నా సోదరుడు" అన్నారు.

ఆయన ముస్లిం అన్న కారణంగా మనస్సులో కించపడిన హిందువులతో "నేను ముస్లిముని కాను. స్వచ్ఛమైన బ్రాహ్మణుడను. ఈ బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమార్గాన్న నడిపిస్తాడు" అన్నారు.

ఆయన మసీదులో నివసించే ముస్లిం ఫకీరైకూడా హిందూ ఆచారాలను సహిస్తున్నా రెందుకని ప్రశ్నించిన భక్తులతో "ఏ దేశంలో వుంటే ఆ వేషం ధరించాలి" అన్నారు. తాము ముస్లిం అయినా హిందూదేశంలో వుండటం వలన హిందూ ఆచారాలను గూడా ఆమోదిస్తూన్నట్లు.

మితిమీరిన మతమౌఢ్యం కొందరు భక్తులలో తొంగి చూచినప్పుడు అటువంటి రెండు ధర్మాల వారిని సమానంగా మందలించి నిగ్రహించారు సాయి. ఎలుగెత్తి గట్టిగా ప్రార్థన చేస్తున్న పఠాను తమకు నిద్రాభంగం చేస్తున్నాడని ఆయనతో ఫిర్యాదు చేసిన హిందువులను మందలించి అతడు దైవాన్ని ప్రార్థించి దుర్బుద్ధి నుండి విడుదలవుతున్నాడు కనుక వారిని ఓర్చుకోమన్నారు. సాయి వక్షస్థలానికి చందనం పూసి పూజించే మహాల్సాపతిని కొట్టాలని మూఢులైన ముస్లింలు కర్రలు పట్టుకుని మసీదు ముంగిట చేరారు. సాయి ఉగ్రులై మహల్సాపతితో, "వచ్చి నా వక్షస్థలానికి చందనమద్ది పూజించుకో. ఎవరడ్డమొస్తారో చూస్తాను!" అని గద్దించారు. ముస్లింలు నివ్వెరపోయి మౌనంగా వెళ్ళిపోయారు.

ఇప్పటికీ సాయి ఆచరించినదీ, బోధించినదీ సద్ధర్మ విరుద్ధమని నిరసించే హిందువులు, ముస్లిములు వున్నారు.

ఒక మతస్థుల దేవాలయంలో, ప్రత్యేకించి మసీదులో వేరొక మతస్థులు తమ ప్రార్థనలు చేయరాదని ఎందరో తలుస్తారు. కానీ ముస్లిము లందరికీ ఆదర్శప్రాయుడైన అల్లాహ్ చేత ఖురాన్ గ్రంథములో నిర్దేశించబడిన మహమ్మద్ ప్రవక్త ఆ భావన తప్పని తమ ఆచరణ ద్వారా నిరూపించారు. ఒకసారి నజ్రాన్ నుండి ఒక క్రైస్తవుల బృందం మహమ్మద్ ప్రవక్త గారి వద్దకు వచ్చి వారున్న మసీదులోనే బస చేశారు. అంతేగాదు అందులో వారి మతానుసారం వారు ప్రార్థనలు చేసుకున్నారు. ఇందుకు కొందరు ముస్లింలు అభ్యంతరం చెప్పారు. కానీ ప్రవక్త మాత్రం వారి అభ్యంతరాన్ని త్రోసిపుచ్చి క్రైస్తవులను వారి ప్రార్థనలను మసీదులోనే చేసుకోమన్నారు. ఈ సంఘటన ప్రవక్తగారి సహచరులు ఇచ్చిన ప్రత్యక్ష సాక్ష్యం 'జెడుల్ మాద్'(Zadul Maad) అనే హదీజ్ గ్రంథంలో వున్నది.

నిజానికి ఇస్లాముకు, క్రైస్తవానికి సిద్ధాంతరీత్యా ఎంతైనా వ్యతిరిక్తత వున్నది. క్రీస్తు భగవదవతారమని, స్వయంగా భగవంతుడి బిడ్డడని, సిలువపై మరణించి పునరుద్ధానమయ్యాడని, ఆయనే భగవంతుడని, ఆయన ద్వారా తప్ప భగవంతుని చేరలేమని, ఆయనను ఆశ్రయించని యితర మతస్తులంతా నరకానికి పోయే పాపులని క్రైస్తవులు నమ్ముతారు. భగవంతునికి జననంగాని, బిడ్డలు గాని వుండవని, క్రీస్తు ఒక గొప్ప ప్రవక్త అని, ఆయన చెప్పిన మార్గాన్ని అనుసరించినా

మిగతా 11వ పేజీలో

పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రశ్న:- మనం బొట్టు పెట్టుకునే కుంకుమ, విభూతుల ప్రాశస్త్యం వివరించండి. విభూతి పైన, కుంకుమ క్రింద పెట్టుకోవాలంటారు. ఎందువలన? కుంకుమ ముత్తైదు స్త్రీలు పెట్టుకుంటారు. విభూతి భర్తలేని స్త్రీలు మాత్రమే పెట్టుకుంటారు. ఈ తేడా లేమిటి?

-శ్రీ ఎ. సత్యనారాయణ, సూళ్ళూరుపేట

జవాబు :-విభుని చిహ్నం విభూతి. అంటే సృష్టికాధారమైన చైతన్యమే విభుడు లేక పరమాత్మ పురుషుడు. ఆయన శుద్ధసత్వ స్వరూపియని గుర్తుంచుకొనేందుకే తెల్లని విభూతి వాడతారు. ఆయన శక్తియే ప్రకృతి లేక జగన్మాత. సృష్టికార్యోన్ముఖమైన ఆ ప్రకృతి రాగాత్మకమని గుర్తుంచుకొనడానికి ఎర్రని కుంకుమ వాడతారు. మొదటనున్న పరమాత్మయే సంకల్ప శక్తి రూపంలో ఈ ప్రకృతిగా అవతరిస్తుందని, దాని కతీతం పరమాత్మయని, అతడి ఆధీనంలోనిదే ప్రకృతియని తెల్పడానికి పైన విభూతి క్రింద కుంకుమ ధరిస్తారు.

సాంసారికమైన సుఖదుఃఖానుభవాల ద్వారా కర్మవాసనల నుండి విడివడి పవిత్రమైన దైవీభావంతో సంసారాన్ని నిర్వహించాలని తెల్పడానికి ముత్తైదువులు కుంకుమ పెట్టుకుంటారు. భర్తను ప్రాణ సమానంగా ప్రేమించిన స్త్రీలు భర్త మరణానంతరము సాంసారిక సుఖ దుఃఖాలనుండి, రాగాత్మకమైన ప్రకృతి నుండి, శోకంనుండి కలిగిన వివేకం ద్వారా విడివడి కేవలం పరమ్మాత ధ్యానం యందే జీవిత శేషాన్ని గడపాలని తెలుపడానికి విభూతి మాత్రమే ధరిస్తారు.

(ఏప్రిల్ 2012 సాయిబాబా మాసపత్రిక నుండి)

తల్లికి తగిన బిడ్డడు – మహాత్ముల ముద్దు బిడ్డడు

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

"తల్లికి తగిన బిడ్డలు కండి – మీ భాండాగారాలను నింపుకోండి" అని శ్రీ శిరిడీ సాయిబాబా చెప్పారు. ఆయన 'ద్వారకామాయికి తగిన బిడ్డలు కండి' అని చెప్పినప్పటికీ 'తనకు తగిన బిడ్డలు కండి' అనే అర్థం. మశీదును 'ద్వారకామాయి' అనేవారు బాబా. ఈ 'మశీదు తల్లి' అని గూడ అంటూండేవా రాయన. అయితే ఆ మశీదు 'ద్వారకామాయి' ఎలా అయింది? అందులో బాబా నివసించడం వల్లనే అయింది. అంటే ద్వారకామాయియే తామని పరోక్షంగా చెప్పినట్లే అయింది. అంతేగాదు, 'నాకెవ్వరి మీదా కోపం రాదు, తల్లికి ఎప్పుడైనా బిడ్డపై నిజంగా కోపం వస్తుందా!' అని గూడ అన్నారు బాబా.

అయితే తల్లికి తగిన బిడ్డలుగా అవడమంటే ఏమిటి? సర్వసంగ పరిత్యాగమా? కఫ్నీ ధరించి భిక్షతో జీవించడమా?కానీ బాబా ఉద్దేశ్యం,ఆయనఆధ్యాత్మికస్థితికి వారసత్వమేగాని మిగతావేవీ అందుకు ప్రమాణాలు గావు. ఎవరైనా సరే భిక్షతో జీవించవచ్చు, జీవించకపోవచ్చు. కఫ్నీ ధరించవచ్చు, ధరించకపోవచ్చు. కానీ ఆధ్యాత్మిక స్థితిలో మాత్రం ఆయనకు తగిన బిడ్డలుగా వుండాలన్నమాట. కారణం ఏ మహాత్ముని యొక్క శిష్యుడుగానీ, భక్తుడుగానీ ఆ మహాత్ముని వల్ల పరిపూర్ణులయ్యారు కానీ వారి వలె జీవించడం చూడము. అంటే ఇక్కడ తల్లికి తగిన బిడ్డ అవడం అంటే ఆధ్యాత్మికంగా పరిపూర్ణులవడమనే అర్థం.

శ్రీ వాసుదేవానందస్వామి శిష్యులైన శ్రీ గుళవణి మహరాజ్ పూజ్యశ్రీ మాస్టరుగారిని చూస్తూనే 'సాయిబాబా కా బేటా' అన్నారు. ఆయన అలా ఎందుకన్నారు? పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీసాయిబాబా యొక్క బిడ్డడు ఎలా అయ్యారు?

తల్లికి తగిన బిడ్డడు అంటే తల్లి గుణాలను పుణికిపుచ్చుకున్నవాడు అని అర్థం. అయితే తల్లి యొక్క గుణాలేమిటి? తన బిడ్డల పట్ల ప్రేమ, ఓర్పు. వారి శ్రేయస్సునే ఎప్పుడూ కోరుకునే మనస్తత్వము, వారి కోసం అపార త్యాగము, తన పట్ల వారి ప్రవర్తన ఎట్లావున్నా క్షమించే గుణము మొదలగునవి.

ఈ సృష్టిలో తల్లిది ఒక ప్రత్యేకమైన స్థానము, ఉన్నత స్థానము, ప్రథమ స్థానము. అందునా 'ద్వారకామాయి' లేక 'సాయి' మామూలు తల్లిగాదు. ఐహిక, ఆధ్యాత్మికతలను ప్రసాదించే జగజ్జనని. అట్టి తల్లికి తగిన బిడ్డలవడమంటే మాటలా? పూజ్యశ్రీ మాస్టరుగారిలో వున్న ప్రత్యేకత ఏమిటి?

పూజ్యశ్రీ మాస్టరుగారికి అట్టి తల్లికి గల గుణాలన్నీ సంపూర్ణంగా వున్నాయి. దయ, క్షమ, దానము, సమాజసేవ, గురుసేవ మొదలగునవన్నీ వున్నాయి.

ఇవిగాక ఆయనలోని ప్రత్యేక లక్షణం ధర్మాచరణ.

పైన చెప్పుకున్న గుణాలన్నీగానీ, కొన్నిగానీ మామూలు వ్యక్తులలోగూడ చూస్తాము. కానీ ధర్మాచరణ గలవారు మాత్రం చాలా కొద్దిమందే వుంటారు. ఉదాహరణకు ఒకనికి దానగుణం ఎంతగానో వుండవచ్చు. కానీ అతనికి అసూయగానీ, లేక మరేదో బలహీనతగానీ వుండవచ్చు. అలాగే ఒక సుగుణం వుంటే దానిని దెబ్బతీసే మరొక బలహీనత వుంటుంది. ఒకనికి ఇంట్లో వాళ్ళవరకే త్యాగం వుంటుంది. అతనికి బయటి వాళ్ళపట్ల స్వార్థము వుండవచ్చు.

ఒకరు ఇంట్లో వాళ్ళను మాత్రమే పట్టించుకుంటే మరొకరు బయట వాళ్ళను మాత్రమే పట్టించుకుంటారు. ఇలా వ్యక్తికీ వ్యక్తికీ సుగుణాలు-దుర్గుణాలు మేళవించి వుండడం చూస్తాము. అలాగాక ధర్మాచరణ ఎప్పుడైతే వుందో అప్పుడు మాత్రమే సరియైన గుణాలు, సరియైన విధంగా, సరియైన స్థాయిలో పనిచేస్తాయి.

ఇలాగే ఆధ్యాత్మికతలో ఒక స్థాయికి ఎదిగినవారిలో గూడ ఇవన్నీ ఇలాగే వుంటాయి.

ఎంతోమంది ఆధ్యాత్మికోపన్యాస మిస్తారు. భగవంతుని పట్ల తమ భక్తిని ఎన్నో రకాలుగా వ్యక్తం చేస్తుంటారు. ఆధ్యాత్మికంగా ఒక స్థాయికి ఎదిగి వుంటారు గూడ. కొందరు తాము గొప్ప భక్తులమని, సాధకులమనీ, గురువులమనీ తలుస్తుంటారుగూడ. కొంతమంది బహిరంగంగానే చెప్పుకుంటుంటారు. కానీ తమ పట్ల ఎవరైనా తేడాగా ప్రవర్తించినా, మాట్లాడినా సహించలేరు. పైగా వాళ్ళను ఎంతో క్షమించినట్లు, వాళ్ళు అన్నమాటలు పట్టించుకోనట్లు నటిస్తారు. కాని వాళ్లను ఏదో విధంగా, ఇతరులు అది తప్పని గుర్తుపట్టలేని విధంగా దెబ్బకొట్టాలని, అణచివేయాలనీ చూస్తుంటారు. ఇంక ఎంత పెద్ద స్థాయిలో వాళ్ళుంటే, అణచివేత అంత పెద్ద స్థాయిలో వుంటుంది. తమను వ్యతిరేకించిన వారిని ఏమి చేయడానికైనా వెనుకాడరు.

మనలో అందరముగూడా పూజ్యశ్రీ మాస్టరుగారి పట్ల ఎంతో భక్తి, ప్రేమ, అభిమానము చూపిస్తాము. నిజంగా వుంటాయిగూడ. ఆయన మనపట్ల కురిపించిన ప్రేమకు పులకించిపోతాము. ఆయన మనకు చేసిన మేలుకు భక్తితో ఉప్పొంగిపోతాము. ఆయన మన పొరపాట్లను పట్టించుకోనందుకు, ఆయన ఓర్పుకు, మంచితనానికి మనకు కళ్ళవెంబడి నీళ్ళుగూడ వస్తాయి. ఇతరులతో ఆనందంగా పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి చెప్పుకుంటాము. చేతనైతే రచనల ద్వారా గూడ ఆ ప్రేమను, అభిమానాన్ని ఎంతో గొప్పగా వ్యక్తం చేసుకుంటాము. అయినా మనకు యితరుల పట్ల కోపము, ఈర్ష్యాద్వేషాదులు లేకుండా వున్నాయా? ఎవరైనా మనలను తక్కువగా చూస్తే 'వాడి అభిప్రాయము వాడిది' అని నిర్లిప్తంగా వుండగలుగుతున్నామా? మన పట్ల యితరులు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే సహించగలుగుతున్నామా? ఇవన్నీ ఎందుకు వస్తున్నాయని ఆలోచిస్తున్నామా? అసలిలాంటి భావాలు మనలో వున్నాయని గుర్తించగలుగుతున్నామా? ఇతరులు మనపట్ల అలా ఎందుకు ప్రవర్తించాలి అని మనకెందుకు అనిపిస్తున్నది? వీటికి పరిష్కారం పూజ్యశ్రీ మాస్టరుగారు ఏమి చెప్పారు? వీటిని తొలగించుకోవడమెలా అనుకుంటున్నామా? తొలగించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామా? ఎవరైనా ఏమైనా అనుకున్నా అవేవీ మనకు తగులుకోవుగదా అని, వాడు చేసినదానికి ఫలితం వాడే అనుభవిస్తాడు గదా అని అనుకుంటున్నామా? అవతలివాడు ఎత్తి చూపిన దుర్గుణాలు మనలో వున్నాయేమోనని వెదకి చూసుకుంటున్నామా?

ఎంతటి ఆధ్యాత్మికవేత్తలైనా, ఋషులైనా పడిపోయేది యిటువంటి విషయాలను ఆలోచించలేకపోవడం వల్లనేనని, వాటిని పోగొట్టుకోనిదే ఆధ్యాత్మికతలో సరియైన మార్గంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేసినట్లు కాదనీ పూజ్యశ్రీ మాస్టరుగారు పదేపదే చెప్తూనే వున్నారుగదా?

కనుక మనం పూజ్యశ్రీ మాస్టరుగారికి ఎంత సన్నిహితులమైనా, ఎంతకాలం ఆయన చెంత వున్నా, ఎంతగా ఆయన ప్రేమకు పాత్రులమైనా, ఎంతగా ఆయన వల్ల సహాయం పొందినా, ఈ బలహీనతలను జాగ్రత్తగా గమనించుకోకపోతే, తొలగించుకోకపోతే ఆయన యొక్క సంపూర్ణ అనుగ్రహాన్ని పొందలేము. కారణం మహాత్ముల దగ్గరకు ఎన్నో కోట్లమంది వెళ్ళి అనేక విధాలుగా వారి అనుగ్రహాన్ని పొంది, అనేక విధాలైన శ్రేయస్సును పొందినా వారి సంపూర్ణ అనుగ్రహాన్ని పొందే శిష్యుడు ఏ ఒక్కడో వుంటాడు. అలాగే బాబా దగ్గరకు వచ్చిన అసంఖ్యాకమైన వారిలో ఆయన సంపూర్ణంగా అనుగ్రహించినవారు ఏ కొద్దిమందో!

'ఆయన సంపూర్ణంగా అనుగ్రహించకపోయినా ఫర్వాలేదు. ఈ మాత్రం అనుగ్రహం మాపై చూపితే చాలు. ఆయన సంపూర్ణంగా అనుగ్రహించే స్థాయికి మనం ఎదగలేదు గదా! మనవంటి వాళ్ళము ఎదగలేము గదా!' అని కొందరు తలచవచ్చు. కానీ అంతస్థాయికి ఎదిగే ప్రయత్నం చేయకపోతే – అంటే మనలోని బలహీనతలను తొలగించుకోకపోతే – మనం దిగజారే పరిస్థితి పొంచి వుంటుంది. ఇంతటి అదృష్టాన్నిగూడ చేజార్చుకున్న వాళ్ళమవుతాము. కనుకనే అన్ని విధాలుగా అన్నిసార్లు పూజ్యశ్రీ మాస్టరుగారు యీ విషయాన్నే నొక్కివక్కాణిస్తూ వచ్చారు.

దీనికే సమాధానంగా పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక ఉపన్యాసంలో చెప్పారు, "మన పెద్దవాళ్ళు అంతవాళ్ళు, ఇంతవాళ్ళు అని చెప్పుకుంటే సరిపోతుందా? వాళ్ళలాగా మనం వుండడానికి ప్రయత్నిస్తున్నామా? మన పెద్దల గురించి గొప్పలు చెప్పుకోవడం సరియైనది కాదని గాదు. వాళ్ళ గొప్పలు చెప్పుకుంటే సరిపోదు. మనమూ అలా వుండడానికి ప్రయత్నించాలి" అని.

ఆయన యింకా యిలా చెప్పేవారు: "ఎంతో వైభవంగా ఉత్సవాలు చేసుకోవడముగాదు. ఎన్నో ఘనమైన కానుకలు భగవంతునికి సమర్పించడమూగాదు. అవన్నీ శక్తి వుంటే చేసుకోవచ్చు. శక్తి లేకపోతే చేసుకోకపోనూవచ్చు. కానీ ఎవరైనా చేసుకోవలసినది, చేసుకోగలిగినదీ వున్నది. అదే సుఖదుఃఖాలకు, నిందాస్తుతులకు పొంగకుండా, కృంగకుండా వుండడం. ధనకాంక్ష, కీర్తికాంక్ష, స్త్రీకాంక్షలకు బానిసలైపోకుండా వుండడం. దీనిని ఎవరైనా ప్రయత్నంవల్ల సాధించవచ్చు. దీనికి ధనవంతులు, బీదవారనే తారతమ్యం లేదు. ఆస్తులు, అంతస్థులు అడ్డురావు. కనుక దీనిని అలవరచుకుని తీరాలి. లేకపోతే మిగతావన్నీ పసిపిల్లల బొమ్మలాటలాగా వుండి తగవులాటలు, పోటీలు, వంతులు, కక్షలు, కార్పణ్యాలకు దారితీస్తాయి. అందుకే మిగతావాటికి వేటికీ నేను ప్రాధాన్యతనివ్వను. ధర్మాచరణకే ప్రాధాన్యతనిస్తాను. ధర్మాచరణవల్లనే వీటిని జయించడం సాధ్యము. ఈ బలహీనతలను జయించడానికి నిజాయితీగా ఒక్కడు ప్రయత్నించినా నా కృషి సార్థకమైనట్లే. వాడు తప్పక కృతార్థుడవుతాడు. సాయికృపకు పాత్రుడవుతాడు."

అందుకే ఆయన ఏ విషయంలోనూ ధర్మం తప్పడం చూడము. అందుకే ఆయన "ధర్మం తప్పనపుడు ఏ ఆశ్రమమైనా ఒక్కటేగదా!" అని నిష్కర్షగా చెప్పగలిగారు.

పూజ్యశ్రీ మాస్టరుగారి ధర్మనిరతి చాలా గొప్పది. అందుకనే ఆయన ధర్మ ప్రబోధాన్ని ఎక్కువగా చేసేవారు. అసలు ఆధ్యాత్మికత అంటేనే ధర్మమని, ధర్మం లేకపోతే ఎంత ఆధ్యాత్మిక సంస్థయైనా సరియైన విధంగా నడవదనీ, అధర్మం అక్కడ గూడా ప్రబలమవుతుందని ఆయన చెప్పేవారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు తమను తాము ఎప్పుడూ గొప్పగా చెప్పుకోలేదు. వారు గొప్పగా సాధన చేసామని గానీ, తాము ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నత స్థితిలో వున్నామనిగాని చెప్పుకోలేదు. కనీసం తాము గొప్ప సాయిభక్తుడినని గూడ ఎక్కడా బయటపడలేదు. తమను గురువుగా ఎందరో తలచినప్పటికీ ఆయన తాము మాత్రం అలా ఏమీ కాదని, అందరికి సాయినాథుడే గురువనీ చెప్పేవారు.

తల్లికి వుండవలసిన గుణాలన్నింటితోపాటు పూజ్యశ్రీ మాస్టరుగారిలోగల అచంచల గురుభక్తి, అకుంఠిత ధర్మాచరణయే ఆయనను సాయి ముద్దుబిడ్డగా చేసాయని ఖచ్చితంగా చెప్పవచ్చు.

అందుకే ఎందరో మహాత్ములు ఆయనను ప్రసంశించారు.

"భరద్వాజ ఈజ్ భరద్వాజ" అని ఒక మహాత్ముడంటే, "భరద్వాజ భగవాన్ హై" అని మరొక మహాత్ముడన్నారు.

"ఆయన చల్లని కుండ" అని నాగమునీంద్రస్వామి అంటే, "ఆయన ఆచార్య పదవికి అర్హులు" అని సుధీంద్రబాబుగారు అన్నారు.

అలాగే చివటం అమ్మ, పాకలపాటి గురువుగారు మొదలైన మహాత్ములెందరో ఆయనను శ్లాఘించారు. అందుకే ఆయన 'సాయిబాబా కా బేటా', 'మహాత్ముల ముద్దుబిడ్డడు', 'తల్లికి తగిన బిడ్డడు.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఏమేమి చేసారో, ఏమేమి చెప్పారో, ఎంత ధర్మబద్ధంగా జీవించారో ఆయన గురించి తెలిసిన మనందరికీ తెలుసు. ఆయన కోరుకున్న విధంగా మన జీవితాలను మలచుకోవడమే మన కర్తవ్యము. కనుక మనలో ఆయన తొలగించుకోమన్న గుణాలు వున్నాయో లేదో నిష్కర్షగా గమనించుకోవాలి. ఆచరించడానికి ప్రయత్నించాలి. నిష్కర్షగా గమనించుకోకుండానే మనలో అటువంటి తొలగించుకోవలసిన గుణాలేవీ లేవని అనుకుంటే ఇతరులకు ఏమీ నష్టం లేదు. 'చెప్పేవాళ్ళు లేక చెడిపోయారు' అన్న సామెత లోకంలో వుంది. కానీ మనం చెప్పేవాళ్ళు వున్నా చెడిపోయిన వాళ్ళమవుతాము. ఇంతటి అదృష్టాన్నీ చేజేతుల జారవిడచుకున్న వాళ్ళమవుతాము. ఎన్నో జన్మలు నష్టపోతాము.

కనుక పూజ్యశ్రీ మాస్టరుగారి కృతజ్ఞతామహోత్సవ సందర్భంగా మనం ఈ ప్రయత్నం నిష్కర్షగా చేసుకుందాము.

జై సాయిమాస్టర్ !

మాతృదేవి స్మృతులు

శ్రీమతి జయసుధ, బాపట్ల

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి స్మృతులను, లీలావైభవాన్ని బాపట్ల వాస్తవ్యులు శ్రీమతి జయసుధగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

మేము బాపట్లలో వివేకానందకాలనీలో వుంటాము. 2012 సం॥లో ఒకసారి మా కాలనీలోనే వుంటున్న సత్యవతిగారు వారింట్లో పూజకు పిలిస్తే వెళ్లాను. వారింట్లో రెండు పటాలు పెట్టి వున్నాయి. మొదటిది బాబా పటం, తెలిసినదే. కానీ ఆ పక్కనే ఉన్న దంపతుల పటం (పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు) ఎవరిదో అప్పటికి నాకు తెలియదు. ఆ పటం చూడగానే నాలో ఏదో తెలియని అనుభూతి కలిగింది. కొంతసేపటికి అక్కడికి కోటేశ్వరరావుగారు వచ్చి శ్రీ సాయిలీలామృతం గ్రంథం చదివి వివరించారు. అది పూర్తయ్యాక, పూజ్యశ్రీ అమ్మగారు శ్రీ సాయిలీలామృతం గ్రంథాన్ని 11 సార్లు పారాయణ చెయ్యమన్నారని, అలా చెయ్యాలనుకున్నవారు దానికి సంబంధించిన కార్డుని, గ్రంథాన్ని తీసుకోమని చెప్పారు. నేను కూడా పారాయణ చేస్తానని, ఆ గ్రంథం, కార్డు తీసుకున్నాను. ఆవిధంగా నాకు బాపట్ల సత్సంగసభ్యులతో పరిచయం ఏర్పడింది. అలా సత్సంగాలకి వెళ్లడం మొదలైన తరవాత మేము అనేక సమస్యలనుంచి బయటపడి చాలా ప్రశాంతంగా వుండగలుగుతున్నాము.

పూజ్యశ్రీ అమ్మగారు నాకు చేసిన మేలు:

జులై 23, 2020 లో మా ఇంట్లో అందరికీ కరోనా వచ్చింది. మాకు చాలా భయం వేసింది. అందరం ఇంటిలోనే వుండి మందులు వాడుతున్నాము. మా అమ్మగారికి 104 జ్వరం వచ్చి రక్తం వాంతి చేసుకున్నారు. ఆసుపత్రికి వెళదామంటే ఆమెకు భయమేసి రానన్నారు. ఆమెకు ఆ రాత్రి గడవటం కష్టమనుకున్నాము. నేను మాకు సత్సంగం చెప్పే కోటేశ్వరరావుగారికి ఫోన్ చేసి బాగా ఏడ్చాను. "మనకు అమ్మగారు, మాస్టరుగారు వున్నారు... ఏమీ బాధ పడవద్దు" అని ఆయన చెప్పారు. పూజ్యశ్రీ అమ్మగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి ప్రార్థన చేసుకుంటూ నిద్రపోయాను.

అప్పుడు ఒక కల వచ్చింది. నేను పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకు వెళ్లాను. అప్పుడు వారు నిద్రపోతున్నారు. నేను చప్పుడు చెయ్యకుండా దూరంగా కూర్చుని వున్నాను. కొంతసేపటికి పూజ్యశ్రీ అమ్మగారు లేచివచ్చి నా ఎదురుగా పడుకుని, వారి పాదాలు నా ఒడిలో పెట్టి కడగమన్నట్లు సైగ చేశారు. అమ్మ పాదాలు నా ఒడిలో వున్నాయి. నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. ఈలోగా కోటేశ్వరరావుగారు వచ్చి బిందెతో నీళ్లు తెచ్చి, 'పాదయోః పాద్యం సమర్పయామి!' అంటూ పాదాల మీద పోస్తున్నారు. నేను పూజ్యశ్రీ అమ్మగారి పాదాలు కడిగి, కొంత తీర్థం తీసుకుని, కొంత తలమీద చల్లుకున్నాను. ఈలోగా నా వెనుకనుంచి పూజ్యశ్రీ మాస్టరుగారు నా తలని గట్టిగా అదిమి పట్టుకుని, ముద్దు పెట్టుకుని నవ్వుతూ చూస్తున్నారు. వెంటనే మెలకువ వచ్చింది. ఎంతో ప్రశాంతంగా, ధైర్యంగా అనిపించింది.

నేను ఉదయాన్నే కోటేశ్వరావు అంకుల్ కి ఫోన్ చేసి, నా స్వప్నం గురించి చెప్పాను. "అమ్మగారు వున్నారు, మీకు ఏం కాదులే" అని ఆయన చెప్పారు. నాకు చాలా ఆనందం వేసింది.

మర్నాడు మా అమ్మకి జ్వరం తగ్గింది. నెమ్మదిగా అందరం కోలుకున్నాము. రిపోర్ట్ లో కూడా నెగెటివ్ వచ్చింది. నా చేత ఆ సేవ చేయించుకుని, మా అనారోగ్యాన్ని పూజ్యశ్రీ అమ్మగారు స్వీకరించి మమ్మల్ని కాపాడారు అనిపించింది. మళ్ళీ మాకు జీవితాన్ని ప్రసాదించిన అమ్మ కరుణ ఏమని చెప్పను?

నేను ఎప్పుడూ పూజ్యశ్రీ అమ్మగారిని చూడలేదు. నేను హైదరాబాదు(నాగోలు)కి కల్యాణ మహోత్సవానికి వచ్చినప్పుడల్లా 'పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం అయితే బాగుండును' అనుకునేదాన్ని. ఆ కోరిక తీరకుండగానే జూన్ 3, 2021తేదీన పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందారన్న వార్త తెలిసి ఎంతో బాధపడ్డాను. శ్రీ ద్వారక బాబుగారి మెసేజ్ విని, 'ఎవరికి దర్శించుకునే అవకాశం లేదు కదా!' అనుకున్నాను. 'ఇక పూజ్యశ్రీ అమ్మగారిని ఎప్పటికీ చూడలేనే!' అని చాలా ఏడ్చాను.

ఆ తరువాత మా సత్సంగ మందిరానికి వెళ్లాను. "నాకు అమ్మగారిని చూడాలని బాగా వుండేది" అని కోటేశ్వరావు అంకుల్ తో చెప్పాను. అంకుల్ "నీవు చూడలేదా అమ్మా," అన్నారు. "లేదు అంకుల్" అన్నాను. చాలాసేపటివరకు కోటేశ్వరరావుగారితో పూజ్యశ్రీ అమ్మగారి గురించి మాట్లాడుకుని ఇంటికి తిరిగి వచ్చాను.

ఆ రాత్రి నిద్ర పట్టక ఆలస్యంగా పడుకున్నాను. మర్నాడు ఉదయమే కోటేశ్వరరావు గారు ఫోన్ చేసి, "పూజ్యశ్రీ అమ్మగారిని ఒంగోలు తీసుకువచ్చారట, మేము వెళుతున్నాము, నువ్వు కూడా వస్తావా అమ్మా?" అని అడిగారు. వెంటనే, "వస్తాను అంకుల్!" అని చెప్పాను. ఆవిధంగా వారిని దర్శించుకునే అవకాశం ప్రసాదించి, సమాధి చెందాక కూడా పూజ్యశ్రీ అమ్మగారు నా కోరిక తీర్చి నన్ను అనుగ్రహించారు. గురుదంపతులైన పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగార్లు మా హృదయాలలో కొలువైవుండి, ఎల్లప్పుడూ వారి ఆశీస్సులు మాకు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అంజలి ఘటిస్తున్నాను.

ఓం స్మృతిమాత్రప్రసన్నాయై నమః!

మత సామరస్యానికి మచ్చుతునక

03వ పేజీ తరువాయి

మానవుడు గమ్యం చేరవచ్చని ఖురాను ఎన్ని సందర్భాలలోనో చెబుతుంది. క్రీస్తును భగవంతుడని, భగవంతుని బిడ్డడని తలచటం మహాపాపమని, భగవంతునికి సాటి కల్పించడమే అవుతుందని, ఆయన తల్లి అయిన మరియమ్మను దేవుని తల్లిగా కొలవడం మహాపాపమని, ఇతర మతస్తులందరూ నరకపాత్రులని క్రైస్తవులు చెప్పడం ఎంత నిరర్థకమో ఖురాన్ బహురీతుల నిరూపిస్తుంది. అటువంటి సందర్భంలో మసీదులో తమ ప్రార్థనలు చేసుకొన్న ఆ క్రైస్తవబృందం విశాల హృదయుడైన ప్రవక్త ప్రభావం వలన సంస్కరించబడి యుండాలని తోస్తుంది.

మసీదులో వారు తమ ప్రార్థనలు చేసుకోవడానికి అవకాశమిచ్చి, దానికి అభ్యంతరం తెలిపిన ముస్లిములను నిగ్రహించిన ప్రవక్త వైఖరి – ఈనాటి సాయినాథుని సద్ధర్మం అల్లాహ్ కు, ప్రవక్తగారికి సమ్మతమని, అదే అసలైన ఇస్లాం అని చాటుతోంది. ఇతర మతస్తులపట్ల మహమ్మద్ ఎట్టి వైఖరిని వహించేవారో అటు ముస్లిములు, ఇటు హిందువులు కూడా గమనించాలి. సరిగా శ్రీ సాయి వహించిన భావమే ఆయన వహించేవారు. మునాఫికన్ అనే మతసాంప్రదాయానికి చెంది, యూదులతోను ప్రవక్తను హింసించిన మక్కా వాస్తవ్యులు తోనూ, చేతులు కలిపిన అబ్దుల్లా-బిన్-అబీను ఆయనెంతగానో క్షమించి సహించారు. అంతేకాదు అతడు మరణించినప్పుడు అతడి శరీరాన్ని ప్రవక్త తమ చొక్కాతో చుట్టడమే కాక, అతని అంత్యక్రియలకు స్వయంగా హాజరై ప్రార్థన కూడా చేశారు. కారణం అబీ ఎప్పుడో చిన్నతనంలో ప్రవక్తగారి మామకు ఒక మేలు చేశాడు. ●



వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

తొమ్మిదవ ప్రసంగము

25. **అద్రోహః** తన పట్ల శత్రుత్వం వహించే వారి యందు ఏ కొంచెం ద్వేషముగాని శత్రుత్వం గానీ కలిగి ఉండకపోవటమే అద్రోహము.

శ్లో॥ సర్వేషామేవ భూతానాం
హరిర్నిత్యం హృది స్థితః I
స ఏవ హి పరాభూతో
యో భూత ద్రోహకారకః II

భావం: అన్ని ప్రాణులలోనూ ఎల్లప్పుడు దేవుడుంటాడు. కాబట్టి ఆ ప్రాణులకు ద్రోహం చేయడమంటే దేవునికి ద్రోహం చేయడమే!

26. ***నాతిమానితా:*** తాను ఉత్తముడనని, గొప్పవాడినని, పూజ్యుడినని; గౌరవము, సత్కారము, పూజ మొదలైనవి కావాలని కోరుకోవడము, ఆ కోరిక లేకపోయినా అవి లభించినప్పుడు సంతోషించడము 'అతి మానిత'. అది వుండకూడదు. ఈ విషయంలో సర్వ వేదాంత సంగ్రహం లో యిలా ఉన్నది:

శ్లో॥ శ్రేష్ఠం పూజ్యం విదిత్వా మాం
మానయన్తు జనా భువి I
ఇత్యా సక్త్యా విహీనత్వం
మానానాసక్తిరుచ్యతే ॥

భావం: 'ప్రజలు నన్ను గొప్పవాడినని పూజింపదగిన వాడినని భావించి పూజించాలి' అనే భావము లేకపోవడమే 'అనాసక్తి' అనబడుతుంది.

దైవీ సంపత్: దేవునితో సంబంధం వుంచుకోదలచినవాడు తన దేవప్రాప్తికి సాధనాలైన సదాచారాన్ని, సద్గుణసముదాయాన్ని కలిగివుంటాడు. దీనిని దైవసంపద అంటారు. ఇదే దైవ ప్రకృతి. పైన చెప్పబడిన 26 గుణాలు కలిగిన మానవుడిని దైవసంపద కలవాడని అంటారు. ఈ 26 గుణాలు మిశ్రసత్త్వానికి సంబంధించినవి. జ్ఞానము శుద్ధ సత్త్వము. శుద్ధ సత్త్వంలోనే బ్రహ్మ సాక్షాత్కారం కలుగుతుంది.

దైవసంపద కలవాడు పరమాత్మ తత్త్వంలోనే తన

చిత్తాన్ని నిలబెడతాడు. అందుకు వ్యతిరేకములైన మాయామోహితాలైన పదార్థాల మీదకు పోనివ్వడు. పరమాత్మ అంటే అతనికి ఎంతో ఇష్టము. ఆయన భజన చేయనిదే అతని మనస్సుకు గాని, బాహ్యములైన ఇంద్రియాలకు గాని మరొకటి సరిపడదు.

దైవ సంపద కలవాని భక్తి

మూలశ్లోకంలో *'జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్'* అంటే వారు దేవుని అన్ని భూతాలకు ఆదికారణుడని, నాశము లేనివాడని తెలుసుకొని భజిస్తారు. శృతి ఇలా చెబుతున్నది:

శ్లో॥ యతో వా ఇమాని భూతాని జాయన్తే,
యేన జాతాని జీవన్తి ।
యత్ప్రయన్త్యభిసంవిశన్తి
తద్విజిజ్ఞాసస్వ తద్ బ్రహ్మేతి ॥

భావం: ఏ పరమాత్మ నుండి అన్ని ప్రాణులు ఉద్భవిస్తున్నాయో, ఎవని ద్వారా జీవిస్తున్నాయో, ప్రళయంలో ఎవరిలో ప్రవేశిస్తున్నవో అతడే బ్రహ్మము. అతనిని తెలుసుకోవడానికి ప్రయత్నించండి.

మూల శ్లోకంలో ***'మహాత్మానః అనన్య మనసః మాం భజన్తి'*** అని వున్నది. విశాలమైనది, మహత్తరమైనది అయిన అంతఃకరణము కలవారు మహాత్ములు. ఈ మహాత్ములు 'అభయం సత్వ సంశుద్ధి' అనే శ్లోకాల ద్వారా చెప్పబడిన దైవప్రకృతిని కలిగి వుంటారు. పరమేశ్వరుడినైన 'నేను' తప్ప మాయనుంచి పుట్టిన ఇతరాలైన స్త్రీ, ధనము మొదలైనవాటిలో మనసు కలిగివుండరు. ఇలా నన్ను – అంటే – పరమేశ్వరుని జగత్తుకంతటికి కారణంగా భావించి భజించాలి.

దైవ సంపద ఒక పరంపరగా లభిస్తుంది

దైవసంపదలోని గుణాలలో ఒకటి రెండింటిని జాగ్రత్తగా ఆచరిస్తే మిగిలినవి తమంతట తామే లభిస్తాయి.

ఒక మహాత్ములైన స్వామి ఒకడు ఒక గ్రామానికి వేరే ఊరి నుండి వచ్చాడు. ఆయన దగ్గరకు చాలామంది వెళుతూ ఉన్నారు. అది చూచి ఒకడు ఆయన దగ్గరకు వెళ్ళి ఏదైనా మంత్రము ఉపదేశించమని ప్రార్థించాడు.

స్వామి: అబ్బాయీ, నీవు ఏమి చేస్తుంటావు?

అతడు: దొంగతనము.

స్వామి: అది కాకుండా ఇంకేదైనా పని చేస్తుంటావా?

అతడు: జూదమాడుతాను. కల్లు తాగుతాను. ఇటువంటి అవినీతికరమైన పనులు చాలాసార్లు చేస్తుంటాను. అబద్ధం కూడా ఆడుతూవుంటాను.

స్వామి: సరే వీటన్నింటిలో ఏదో ఒకటి మానేస్తానని ప్రమాణం చేయి.

అతడు: ఇలా ఆలోచించాడు.. దొంగతనం చేయకపోతే ఆకలితో చనిపోతాను. కల్లు త్రాగడం మానలేను. దేనిని విడవడానికి వీలవడం లేదు. ఒక అబద్ధం ఆడటం మాత్రం మానగలనే అనిపిస్తున్నది.

స్వామివారికి అతడిలా చెప్పాడు: "స్వామి ఈరోజునుండి నేను అబద్ధం ఆడను".

స్వామివారు 'సరే' అని అతనికి మంత్రదీక్షను ఇచ్చారు.

కొన్ని రోజుల తర్వాత అతడు దొంగతనం చేయడానికి రాజభవనానికి వెళ్ళాడు. అతడు గోడనెక్కి రాజభవనపు పై భాగానికి చేరాడు. ఆ రోజు ఎండ ఎక్కువగా వుండటం వలన రాజు పై భాగంలో తిరుగుతూవున్నాడు. అతనిని చూచి రాజు,

నీవు ఎవరివి? అని ప్రశ్నించాడు.

దొంగ: నేను దొంగను. నీవు ఎవరివి?

రాజు: నేను కూడా దొంగనే. మనమిద్దరం కలిసి రాజుగారి ఖజానాను దొంగిలిద్దాము. కానీ నువ్వు దొంగవేనని నమ్మకం ఏమిటి? తీరా నన్ను నీవు పట్టించివేస్తే?

దొంగ తాను అబద్ధమాడనని గురువు దగ్గర తాను చేసిన ప్రమాణం గురించి వివరించాడు. రాజుకు అతని మీద నమ్మకం కుదిరింది.

ఆ తరువాత అతడు దొంగతో ఇలా అన్నాడు, "నేను తాళంచెవులు సంపాదించాను. నీ పని తేలిక చేశాను".

తరువాత వారిద్దరూ కలిసి ఖజానా తెరిచి నగలను దొంగిలించారు. ఆ తరువాత వారిద్దరూ ఆ సొమ్మును పంచుకుంటూ, ఒక బంగారు పెట్టె నుంచి మూడు వజ్రాలను తీసుకొన్నారు. వాటిని ఎలా పంచుకోవాలో తెలియలేదు. అప్పుడు రాజు ఇలా అన్నాడు: "ఒక వజ్రాన్ని

రాజుకు ఉండనిద్దాము. మిగిలినవన్నీ మనిద్దరం పంచుకుందాము!"

అలా చేసి వారిద్దరూ విడిపోయారు. రాజు దొంగ యొక్క చిరునామా తీసుకున్నాడు. తన చిరునామా మాత్రం సరైనది ఇవ్వలేదు. రెండవ రోజున రాజు తన దివానును పిలిచి, "మన ఖజానాలో దొంగతనం జరిగింది. ఏమేమి పోయాయో తెలిపి, దొంగను పట్టుకోండి" అని ఆజ్ఞాపించాడు.

దివాను ఖజానా వెతికాడు. ఒక వజ్రం దొరికింది. దానిని ఆ దివాను తన మొలలో దాచుకున్నాడు. రాజు దగ్గరకు వచ్చి దివాను ఇలా చెప్పాడు: "ఆ దొంగ ఏమి మిగల్చలేదు. అన్నీ దొంగిలించాడు. దొంగను పట్టుకోవడానికి ఎంతో ప్రయత్నించాను. కానీ ఏమాత్రం అతని జాడ తెలియలేదు". అప్పుడు రాజు ఆ దొంగ చిరునామా చెప్పి అతనిని తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. దొంగను తెచ్చి రాజు ఎదుట హాజరు పరిచారు.

రాజు అడిగాడు: "దర్బారులో దొంగతనం జరిగింది. నీకు తెలుసా?"

దొంగ అంగీకరించాడు, "నేనే ఆ దొంగతనం చేసాను."

రాజు: అన్నీ దొంగిలించావా?

దొంగ: ఖజానాలో మూడు వజ్రాలు ఉన్నాయి. మేము ఇద్దరము దొంగలము. మేము చెరొక వజ్రము తీసుకుని ఒకటి తమకు ఒకటి వదిలివేసాము.

అది విని రాజు దివానుతో, "ఆ వజ్రం నీ దగ్గర ఉన్నది. బయటకు తీయి" అని గర్జించాడు.

దివాను ఇక చేసేదేమీ లేక తన మొల నుండి ఆ వజ్రాన్ని బయటకు తీశాడు.

రాజు ఇలా అన్నాడు, "ఈరోజు నుండి ఈ నిజాయితీ గల ఈ దొంగను దివానుగా నియమిస్తున్నాను. ఎందుకంటే ఇతడు నిజం పలుకుతున్నాడు. కనుక ఎంతో నమ్మదగినవాడు" అని ఆ దొంగకు దివాను పదవినిచ్చాడు.

ఆ తరువాత రాజు ఆ దొంగతో ఇలా అన్నాడు: "నీకు నిజం చెప్పమని ఆజ్ఞాపించిన మీ గురుదేవులు ధన్యులు. వారి ఆజ్ఞను నీవు పాటించి ఈ స్థితికి వచ్చావు. నీవు దర్శించిన ఆ గురువుగారిని నేను కూడా దర్శిస్తాను. నాకు కూడా ఆయనను చూపించు. వారి సదుపదేశాన్ని నేను కూడా స్వీకరిస్తాను.

ఇది విని ఆ దొంగ ఇలా ఆలోచించాడు: 'ఒక్క సత్యవాక్పాలనము (సత్యం పలకడం) మాత్రానే నేను దివాను పదవిని పొందాను కదా!' ఇలా భావించి అతడు దైవసంపదకు చెందిన మిగిలిన గుణాలను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించాడు.

కొద్ది రోజులలో ఆ గురువుగారు అక్కడికి వచ్చారు. ఆ కొత్త దివాను వెళ్లి ఆయనను దర్శించాడు. ఆయన పాదాలపై పడి నమస్కరించాడు.

స్వామి: నీవు ఎవరివి?

దివాను: ఇంతకుముందు ఈ నగరంలోకి మీరు వేంచేసినప్పుడు మీరు అందరికీ ధర్మోపదేశం చేశారు. దీక్ష నిచ్చారు. నేను మీ దగ్గరికి వచ్చి ధర్మదీక్షను యిప్పించమని ప్రార్థించాను. మీకు నేను దొంగనని, జూదమాడుతానని, అబద్ధాలాడుతానని నా పరిచయం చేసుకున్నాను. అప్పుడు అన్ని పాపాలనూ చేసేవాడిని. వాటిని విడిచిపెట్టమని మీరు ఆజ్ఞాపించారు. కానీ నేను వాటిని విడవలేనని చెప్పాను. కేవలం సత్యం మాత్రం పలుకగలనని చెప్పాను. ఆ సత్యపాలనము వలననే ఇక్కడి రాజుగారు నన్ను నమ్మదగినవాడిగా భావించి నాకు ఈ దివాను పదవి నిచ్చారు. ఈ సత్య వాక్పాలనములో (సత్యమే పలకడం వలన) మొదట్లో నాకు ఎన్నో కష్టాలు వచ్చాయి. కానీ చివరికి నాకే శ్రేయస్సు కలిగింది.

అది విని ఆ గురువుగారు ఎంతో సంతోషించి యిలా అన్నారు, "నా దగ్గర చాలామంది దీక్ష తీసుకున్నారు. కానీ సరిగ్గా పాలించినవాడివి నీవు మాత్రమే!" దివాను స్వామివారి అనుమతి తీసుకుని రాజుగారికి వారి దర్శనం చేయించాడు.

ఆ తరువాత రాజు ఆజ్ఞను స్వీకరించి ఇలా అన్నాడు, "నేను ఈ దివాను పదవిని వదిలి గురుసేవను స్వీకరిస్తున్నాను".

అది విని రాజుకెంతో ఆశ్చర్యం కలిగింది. అతడు ఇలా అన్నాడు, "ప్రాపంచిక విషయాలను త్యజించి సత్పురుషుల సంసర్గంలో త్యాగశీలురు అయిన వారు ధన్యులు".

రాజు కూడా ఆ మహాత్ముని సదుపదేశాన్ని తీసుకొని తన రాజ్యాన్ని తన కుమారునికి యిచ్చివేశాడు.

వారిద్దరూ ఆ మహాపురుషుని వెంటనుండి, దైవసంపదకు సంబంధించిన నియమాలను పాటించి,

శుద్ధ సాత్త్వికమోక్షాన్ని పొంది, సంసార సాగరం నుండి విముక్తులయ్యారు.

ఇలాగే ఒక దైవగుణము వస్తే, మిగిలిన గుణాలన్నీ వాటంతటు అవే వస్తాయి.

ఇప్పుడు ఒక అనుమానం కలగవచ్చు. పురాణాలలో దేవతల గురించి చెప్పబడివున్నది కదా! వారిలో కొంతమంది విషయలోలులు కదా! అది దైవగుణమా? అని.

అసురులతో సమానులైన దేవతలు

ఈ విషయంలో ఆత్మ పురాణంలో ఇలా ఉన్నది:

శ్లో॥ ఆత్మజ్ఞానముపేక్ష్యాథ
దేవా యే భోగలంపటాః 1
అసురా ఏవ తే జ్ఞేయా
ఆత్మధర్మ బహిష్కృతాః ll

భావం: ఏ దేవతలు ఆత్మజ్ఞానాన్ని విడిచి భోగాలంపటులవుతారో అటువంటి ఆత్మజ్ఞాన ప్రయత్నమే లేని దేవతలు అసురుల వంటివారే

ఇటువంటి దేవతల యొక్క 'దేవ' శబ్దము నామ మాత్రమే. కారణము వారిలో దేవ సంపద వుండకపోవడమే.

బృహదారణ్యకోపనిషత్తులో ఈ కథ ఉన్నది:-

అధికారానుగుణమైన గ్రహణము

దేవతలు, మానవులు, అసురులు - అందరూ ప్రజాపతి యొక్క బిడ్డలే. వారంతా ఒకసారి తమ తండ్రి అయిన ప్రజాపతి దగ్గరకు వెళ్లి ఇలా అడిగారు:-

"తండ్రీ! మాకు ఏదైనా ఉపదేశించండి."

వారికి ప్రజాపతి ఒకే అక్షరమైన 'ద' ను ఉపదేశించి ఇలా అడిగాడు: "మీకు నా ఉపదేశం అర్థమైందా?"

దేవతలు ఇలా అన్నారు: "మేము స్వభావసిద్ధంగా ఇంద్రియలోలత్వము కలవారము. భోగ విలాసాలలో ఎల్లప్పుడూ తేలుతూవుంటాము. కాబట్టి మాలాంటి వారికి దమనమే (నిగ్రహించుకోవడం) ముఖ్యమైన ధర్మమని చెప్పడానికే మీ ఉపదేశానికి బీజాక్షరంగా మీరు 'ద' అనే అక్షరాన్ని మాకు ఉపదేశించారు."

ఇది విని ప్రజాపతి "ఓం" అని పలికాడు. అంటే 'అదే యథార్థము' అని అర్థము. దేవతలు తన ఉపదేశ రహస్యాన్ని తెలుసుకున్నారని గ్రహించి సంతోషించాడు.

ఆ తరువాత మానవులు ప్రజాపతిని ఆజ్ఞాపించమని ప్రార్థించారు. ప్రజాపతి వారికి కూడా 'ద' అనే అక్షరాన్ని ఉపదేశించాడు. వారిని కూడా ప్రజాపతి "నా ఉపదేశం యొక్క అర్థాన్ని తెలుసుకున్నారా?" అని అడిగాడు.

మానవులు ఇలా అన్నారు: "మేము స్వభావసిద్ధంగా లోభము మొదలైన వికారాలకు లోనౌతుంటాము. మేము అన్నము మొదలైనవి దానము చేయడానికి బాధపడుతూవుంటాము. కాబట్టి మీరు మమ్మల్ని ఆ బీజాక్షరం ఉపదేశించడం ద్వారా 'దానము' చేయమని ఆజ్ఞాపించారు."

ప్రజాపతి వారికి కూడా తాను ఉపదేశించినది అదేనని చెప్పాడు.

ఆ తరువాత అసురులు కూడా ప్రజాపతిని తమకు ఉపదేశించమని ప్రార్థించారు. వారికి కూడా ప్రజాపతి 'ద' అనే అక్షరాన్నే ఉపదేశించాడు.

"మీకు దాని భావం అర్థమైందా?" అని వారిని అడిగాడు.

అసురులు ఇలా సమాధానం చెప్పారు: "మేము ఎప్పుడు హింస చేస్తూవుంటాము. ఇది మా స్వభావం. కాబట్టి మమ్మల్ని ప్రాణులపట్ల దయ కలిగి ఉండాలని ఉపదేశించారు."

ఇది విని ప్రజాపతి వాస్తవమేనని అంగీకరించాడు.

పై కథను బట్టి ప్రకృతి సిద్ధమైన సంస్కారాన్ని, అధికారాన్ని కలిగిన విషయాలలో ఆత్మకళ్యాణానికి వేరొక ప్రక్రియ ద్వారా శ్రేయస్సును సాధించే విధానము వెల్లడౌతున్నది. అంటే దేవతలు స్వాభావికంగా విషయలోలత్వము కలిగినవారు. వారికి ఇంద్రియాలని నిగ్రహించుకోవడం (ఇంద్రియ దమనము) అవసరమని శ్రుతులలోనే చెప్పబడివున్నది. కాబట్టి 'దేవ' శబ్దము వారి పట్ల నామ మాత్రమే!

- సశేషం

(గత సంచిక తరువాయి)

శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

శ్రీ ఆనందమయి మాతతో సన్నిహితంగా మెలిగిన వ్యక్తులలో గురుప్రియాదేవి ఒకరు. ఆమె తండ్రి శ్రీ శశాంక మోహన్ ముఖోపాధ్యాయ ఒక రిటైర్డ్ సివిల్ సర్జన్. ఆయన మొట్టమొదటగా డిప్యూటీ పోస్టుమాస్టర్ జనరల్ శ్రీ ప్రమథనాథ వసుగారి ద్వారా విని అమ్మను దర్శించుకొన్నారు. మొదటి దర్శనంలోనే ఆయన అమ్మను శక్తి స్వరూపిణిగా గుర్తించారు. అమ్మ పట్ల భక్తి ప్రపత్తులతో తరచు అమ్మను దర్శించసాగారు. ఇంటికి వచ్చి తన కుమార్తె అయిన గురుప్రియాదేవితో అమ్మను గురించి చెప్పేవారు. అయితే ఆమె స్వతహాగా బిడియస్తురాలు కావటంవలన కొత్త ప్రదేశాలకు వెళ్లటానికి, కొత్తవారితో కలవటానికి యిష్టపడేవారు కాదు. అందువల్ల ఆమె చాలా రోజులవరకు, తన తండ్రిగారు చెప్పినా అమ్మను దర్శించుకొనలేదు.

ఒకరోజు శశాంక ముఖోపాధ్యాయ అమ్మను దర్శించుకొన్నపుడు ఆనందమయి అమ్మ ఆయనతో "రేపు మీ కుమార్తెను కూడా తీసుకొని రండి" అని అన్నారట. అమ్మ ఆహ్వానం మేరకు అమ్మను గురుప్రియాదేవి క్రీ.శ. 1925 సం॥లో మొదటిసారి దర్శించుకొన్నారు. అప్పటినుండి ఆమె ఆనందమయి అమ్మతో అత్యంత సన్నిహితురాలిగా అమ్మ సాంగత్యాన్ని పొందారు.

గురుప్రియాదేవి అమ్మను దర్శించుకొన్న సమయంలో అమ్మ లోపలి గదిలో ఒక్కరే కూర్చుని వున్నారు. ఈమెను చూడగానే అమ్మ ఒక అలౌకిక స్వరంతో "ఇన్నాళ్లు ఎక్కడ వున్నావ్?" అంటూ నవ్వారు. ఆ స్వరంలోని ఆప్యాయతకు కరిగిపోయారు గురుప్రియాదేవి. మొట్టమొదటగా అమ్మ పలికిన ఆ మాటలలో తమ యిద్దరి మధ్య వున్న అనుబంధం యీ జన్మది మాత్రమే కాదన్న అర్థం స్ఫురించింది గరుప్రియాదేవికి. ఆమె హృదయం శాశ్వతంగా అమ్మ పాదాలకు అంకితమైపోయింది. అప్పటినుండి ఆమె తరచు అమ్మను దర్శించసాగారు.

శ్రీ ఆనందమయి అమ్మ తరచు సమాధి స్థితిని పొందుతుండేవారు. మనసు, శరీరం ఒక అతీత స్థితిలో వుండి తరచూ సమాధిస్థితిలోకి జారిపోతూ వుండటంతో ఆమె బాహ్యస్మృతిని కోల్పోతుండేవారు. ఇంటి పనులు చేసుకొనటం కూడా రానురాను కష్టం అవటంతో శ్రీ భోలానాథ్ గారు తన సోదరి మాధవిని పిలిపించుకొన్నారు. ఆమె యింటి పనులలో సహాయపడేవారు.

గురుప్రియా దేవి వచ్చిన కొన్నాళ్లకు శ్రీ ఆనందమయి అమ్మ ఆమెతో "గురుప్రియా! అప్పుడప్పుడు నాకు యింటి పనులు చేసుకోవటం కష్టంగా వుంది. ఇక్కడకు వచ్చే భక్తులు కొందరు నాకు సహాయం చేయటానికి సిద్ధంగా వున్నప్పటికీ ఆ భక్తురాళ్ళు బ్రాహ్మణులు కాకపోవడంతో ఇంట్లో మడివంటలు, దైవనివేదనలు వుండటంతో వారిని పిలువలేదు. ఇప్పుడు ఆ భగవంతుడే నిన్ను పంపినట్లున్నాడు" అన్నారు. ఇలా అమ్మ గురుప్రియాదేవితో తన పరిస్థితి గురించి, గురుప్రియాదేవి కుటుంబ

పరిస్థితుల గురించి అనేక విషయాలు మాట్లాడేవారు. అప్పటివరకు అమ్మ ఎవరో తెలియకుండా అమ్మను ఒక్కసారికూడా చూడకుండావున్న తనతో ఆమె అతిసన్నిహితురాలు, ఆప్తురాలివలె వ్యవహరించడం చూచి గురుప్రియాదేవి ఎంతో ఆశ్చర్యపోయారు. ఆ రోజు చాలాసేపటి తర్వాత తిరిగివెళ్లే సమయంలో అమ్మ శశాంక గారితో "ఈమెను మళ్లీ తీసుకురండి" అన్నారు. ఆనాటి నుండీ గురుప్రియ ప్రతిరోజు అమ్మను దర్శించసాగారు. ఆమెకు నిరంతరం అమ్మ ధ్యాసే. ఒక్కొక్కసారి రోజుకు రెండుసార్లు, మూడుసార్లు కూడా అమ్మను దర్శించేవారు. క్రమంగా అమ్మతో పరిచయం బాగా పెరిగి అమ్మకు యింటి పనులలో, వంటపనులలో సహాయపడటం ప్రారంభించారు గురుప్రియా దేవి.

క్రమక్రమంగా అమ్మ యొక్క దివ్యత్వం బాగా వెల్లడి కావటంతో అమ్మ దర్శనార్థం వచ్చే ప్రజల సంఖ్య బాగా పెరిగింది. కొందరు నిత్యమూ అమ్మ దర్శనార్థం వచ్చేవారు. ప్రఫుల్ల బాబు అనే భక్తుని భార్య ఉష యిలా అనేవారు "షాహ్-బాగ్ తోటలోని యీ అమ్మను చూడటానికి ప్రతిరోజూ వస్తున్నాను. ఆమెను చూడకుండా వుండలేక పోతున్నాను. మా అత్తగారు యిందుకు అభ్యంతరం చెపుతున్నారు. "నువ్వు ప్రతిరోజూ షాహ్-బాగ్ వెళ్ళి ఆమెను దర్శించుకొని తీరాలని ఏముంది? ఇంటిలోనే వుండి ఏ ధర్మమైనా ఆచరించుకొన వచ్చును కదా?" అని అంటారామె. అందుకు నేను "ఇక్కడకు రావటం ధర్మం అనే వుద్దేశంతో రావటం లేదు. నాకు ధర్మాధర్మాలు తెలియవు. అమ్మను ఒక్క రోజు చూడకపోయినా నాకు పిచ్చెత్తి నట్లుంటుంది. ఆమెను ఎప్పుడెప్పుడు చూస్తానా అని నా మనస్సు తహ తహ లాడుతుంది. అందుకే వస్తున్నాను" అని అంటాను – ఇలా చెప్పేవారామె!

అలా ఒక దివ్యమైన ఆకర్షణ అమ్మ పట్ల పొందేవారు భక్తులు. గురుప్రియా దేవి అనుభవం కూడా అదే! క్రమంగా ఆమె రోజంతా అమ్మ యింటిలోనే కాలం గడుపుతూ అమ్మ కుటుంబంలో ఒక సభ్యురాలి వలె మారిపోయారు. కొద్దిసేపు మాత్రం తమ యింట్లో వుండి తిరిగి అమ్మ వద్దకు పరుగు పరుగున వచ్చేవారామె.

గురుప్రియా దేవి తండ్రియైన శశాంక బాబు అమ్మను ఒకసారి తమ యింటికి విచ్చేయమని ప్రార్థించగా అమ్మ అంగీకరించారు. అమ్మతో పాటు కొందరు భక్తులు కూడా శశాంక బాబు యింటికి వచ్చారు. శశాంక బాబు అందరికీ విందుభోజనం ఏర్పాట్లు చేశాడు. గురుప్రియా దేవి ఆ రోజు అమ్మ యొక్క విశేష అనుగ్రహాన్ని పొందారు. ఎలాగంటే, అమ్మ ఆ రోజు తన స్వహస్తాలతో ఆమెకు అన్నం తినిపించారు. ఆమెతో ఒకే కంచంలో భుజించారు. ఆ సమయంలో గురుప్రియా దేవి అమ్మతో "అమ్మా!! మీరు అంతా నాకే తినిపిస్తున్నారు. మీరేమీ తినటం లేదమ్మ" అన్నది. ఆనందమయి అమ్మ "ఈరోజు నేను నీకు వినిపిస్తున్నాను. కానీ, భవిష్యత్తులో నువ్వే నీ చేతులతో నాకు తినిపిస్తావు" అన్నారు గురుప్రియా దేవితో. అమ్మ పలికిన యీ వాక్యాలు భవిష్యత్తులో అక్షరాలా నిజమైనాయి. కాలక్రమేణా అమ్మ తరచు సమాధి స్థితిలోకి వెళ్ళడం, గంటల తరబడి బాహ్యస్పురణలో లేకుండటంతో అమ్మకు భోజనం తినిపించటమే కాదు, స్నానం చేయించటం, చీరె కట్టటం యింకా యింటి పనులు – యివన్నీ గురుప్రియా దేవియే చేయటం జరిగింది.

అదే రోజు మరొక చిత్రమైన సంఘటన జరిగింది. భోజనాలకు ముందు అందరూ కూర్చుని మాట్లాడుకొంటూ వుండగా నిశిబాబు అనే ఒక భక్తుడు ఎంతో ఆందోళనతో అమ్మ వద్దకు వచ్చాడు. తన మనుమడి చెవి ఆభరణం చెవి చర్మంలోకి గుచ్చుకొని పోయిందనీ, బయటకు తీయటం కష్టంగా వున్నదని, పరిస్థితి చాలా ఆందోళనకరంగా వున్నదని చెప్పాడు. దయతో ఒక్కసారి తన యింటికి తన బిడ్డ వద్దకు వచ్చి కాపాడమని కన్నీటితో ప్రార్థించాడు. అటువంటి సమయాలలో ఆనందమయి మాత ప్రవర్తన చిత్రంగా వుండేది. ఆమె స్వయంగా తన నోటితో చెప్పకుండా ప్రక్కన వున్న వారితో "ఏమౌతుంది?" అని అడిగేవారు. వాళ్ళు సరిగా చెప్పకపోతే "చూడండి, వీళ్ళు గట్టిగా చెప్పటం లేదు. బహుశా తగ్గదేమో!" అనేవారు. "మీ అనుగ్రహంతో ఎందుకు నయం కాదు? తప్పకుండా వాళ్ళు స్వస్థత పొందుతారమ్మా" అని వాళ్ళు అన్నట్లయితే... "వీరు ఆపద గడుస్తుందంటున్నారు. అలా జరుగుతుందన్నమాట!" అనేవారు. ఆవిధంగా మంచి అయినా, చెడు అయినా తనకై తాను చెప్పక, ప్రక్కనున్న వారి ద్వారా ఫలితం ఎలా వుంటుందో సూచించేవారు.

ఆ రోజు ఆ సమయంలో కూడా అమ్మ గురుప్రియా దేవి వైపు చూస్తూ "ఏమవుతుంది అబ్బాయికి? నయమవుతుందంటావా?" అన్నారు.

"అమ్మ స్వయంగా వెళ్తున్నారు కదా! తప్పక నయమవుతుంది" అన్నారామె. "చూడండి, తను చెప్తున్నది కదా! నయమౌతుందన్నమాట" అన్నారు. అలా అంటూ అమ్మ నిశిబాబు ఇంటికి బయలుదేరారు. కొంతసేపటి తర్వాత అందరూ తిరిగి వచ్చారు. కానీ అక్కడ ఏమి జరిగింది – అన్న విషయం గుప్తంగా వుంచబడింది. కొన్నాళ్ళ తర్వాత ఆ విషయం బయటకు వెల్లడి అయింది. అమ్మ అక్కడకు వెళ్ళిన తర్వాత, ఎవరూ ఏ ప్రయత్నం చేయకుండానే ఆ పిల్లవాని చెవి ఆభరణం దానంతట అదే వూడిపోయి క్రింద పడిపోయిందట. అమ్మ అనుగ్రహంతో పెద్ద ఆపదనుండి ఆ బాబు బయటపడ్డాడు.

1925 సంవత్సరం పుష్య సంక్రాంతికి సూర్యగ్రహణం వచ్చింది. అందరూ ఆనాడు అమ్మ సన్నిధిలో సంకీర్తన చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని అన్ని ఏర్పాట్లు గావించారు. ఆ రోజు వుదయాన్నే భక్తులంతా అమ్మ గృహప్రాంగణంలో కూర్చుని భక్తిశ్రద్ధాన్విత హృదయులై సంకీర్తన చేయసాగారు. బావుల్ బాబు, అతని భార్య, దేవేంద్రప్రసాద్, మాధవీ అత్త యింకా కొందరు భక్తులు వంటలో నిమగ్నులైనారు. సంకీర్తన చెవిన పడగానే అమ్మ సమాధిమగ్నులై బాహ్యస్మృతి కోల్పోయారు. ఆమె కొంతసేపటికి మామూలు స్మృతికి వచ్చిన తర్వాత భక్తుల మధ్యకు వచ్చి కూర్చుని సంకీర్తనలో పాల్గొన్నారు.

"హరే మురారే మధుకైట భారే
గోపాల గోవింద ముకుంద శౌరే"

అంటూ అమ్మ తన మధురమైన కంఠంలో చాలాసేపు సంకీర్తన చేశారు. చాలాసేపటి వరకు సంకీర్తన సాగింది. అప్పుడు అమ్మ సంకీర్తన ప్రదేశం నుండి లేచి, భోలానాథ్ గారితో కలసి దేమునికి నైవేద్యం సమర్పించటానికై లోపలికి వెళ్ళారు. దేమునికి ధూపదీప నైవేద్య సమర్పణ తర్వాత యిద్దరూ బయటకు వచ్చారు. ఆ తరువాత భక్తులందరూ తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆ సందర్భంలో ఒక సంఘటన జరిగింది. స్త్రీలంతా అమ్మ వద్ద కూర్చున్నారు. ఒక పురుషుడు వీరికి కొంతదూరంలో నిలబడి వున్నాడు. మేలిముసుగులో నుండే అమ్మ దృష్టి అతనిపై బడింది. అమ్మ అతనితో "స్త్రీలను చెడు దృష్టితో చూడవద్దు" అని తీవ్రంగా హెచ్చరించారు. అతడు అమ్మకు శరణాగతుడైనాడు. స్త్రీల పట్ల పవిత్ర భావనలు కలిగేలాగ తనను ఆశీర్వదించమని అతడు ఆనందమయి అమ్మను వేడుకున్నాడు. ప్రతిరోజు కొంతసేపు తన వద్ద కూర్చుని వెళ్ళమని, స్త్రీలు ఎదురుపడితే వారిపాదాలను మాత్రమే (కొన్నాళ్ళ వరకు) చూడవలసిందనీ, ముఖాలను చూడవద్దనీ అమ్మ ఆదేశించారు. అమ్మ చెప్పినట్లు చేసిన అతడు అనంతరకాలంలో తన బలహీనత పూర్తిగా తొలగిపోవటంతో ఎంతో ఆనందించాడు.

1925 ఫాల్గుణ బహుళ చవితి రోజు సరస్వతీపూజ పండుగ వచ్చింది. ఆ రోజు ఢాకా లోని మెడికల్ కాలేజీ విద్యార్థులు పూజ, పేదలకు అన్నదానము కాలేజి ఆవరణలోనే జరపాలనీ, శ్రీ ఆనందమయి మాత ఆ కార్యక్రమాలకు విచ్చేయాలని సంకల్పించి, అమ్మ వద్దకు వచ్చి, అమ్మను ఆహ్వానించారు. సంకీర్తన సమయంలో అమ్మకు సమాధిస్థితి, శరీరంలో అనేక యోగక్రియలు ప్రకటమవటం జరుగుతుంది కనుక అచటకు విచ్చేసిన ప్రజలు అమ్మ స్థితిని అర్థం చేసుకొనలేక పలు పలు విధాల అపోహలకు గురయ్యే అవకాశం వున్నది కనుక షాహ్-బాగ్ తోటలోనే కార్యక్రమములతో నిర్వహించాలని భక్తులు తలచారు. అయితే ఎక్కువమంది భక్తులు రావటం వలన తోటలోని చెట్లు పాడయ్యే అవకాశం వున్నది కనుక తోట యజమానులు అనుమతించలేదు. అందువలన మొదట అనుకున్న ప్రకారము ముందురోజు రాత్రే అమ్మ బోలానాథ్ గారితో కలసి భక్తులందరితో కాలేజీకి వెళ్ళారు. భక్తులంతా వంటచేసే సేవలో పాల్గొన్నారు. సూర్యోదయం తర్వాతనే చేయాలనీ, సూర్యోదయానికి ముందే వంటలు చేసి దరిద్రనారాయణులకు చద్ది వంటలు వడ్డించడం దోషమని చెప్పి అమ్మ సూర్యోదయం తర్వాతనే వంటలు చేయించారు. శ్రీ ఆనందమయి అమ్మ కూడా వంటలో పాల్గొన్నారు. అంతేకాదు, ఏ పుణ్యప్రదమైన కార్యక్రమం చేయాలన్నా ముందుగా నిష్ఠ చాలా అవసరమని చెప్పి, సరస్వతి పూజ ముందురోజు రాత్రి అంతా అమ్మ భక్తులతో సంకీర్తన చేయించారు

- సశేషం

భక్తవత్సలుడు

శ్రీమతి మల్లాది సుబ్బలక్ష్మి

(భగవదనుగ్రహం వల్ల లభించిన మాస్టరుగారి పరిచయాన్ని 'నిష్ఠ', 'సబూరి'లతో దిన దినాభివృద్ధి కావించుకొని సత్సంగాలు నిర్వహిస్తూ ఆ రోజుల్లో ఒంగోలు లాయరు పేటలో బాల భజన బృందం చేత భజనత్తయ్యగారిగా పిలవబడటమే కాక, మాస్టరుగారి చేత కూడా అత్తగారిగా పిలిపించుకున్న భాగ్యశాలి. జీవితంలో మాస్టరుగారి స్మరణను క్షణం కూడా ఏమారని ఈమె వారి అనన్య శరణాగతిలో పొందిన అనుభూతులను, అనుభవాలను, అందించు చున్నారు.)

మేము సూళ్ళూరు పేటలో వున్నప్పుడు మా యింటి ప్రక్కన భరద్వాజ మాస్టరుగారి భక్తుడు భాస్కరరెడ్డి అనే అతను వుండేవాడు. అప్పుడప్పుడు అతను మాస్టరుగారి గురించి ఎంతో అద్భుతంగా చెప్తూండేవారు. అందువల్ల నాకు మాస్టరుగార్ని చూడాలని ఎంతగానో అన్పించేది. కానీ మావారికి అలాంటివంటే యిష్టం వుండేది కాదు. నాకెంతగా చూడాలని వున్నా మావారు ఒప్పుకోకపోవటం వల్ల అతని చేతనే మాస్టరుగారి దగ్గర్నుంచి "సాయిబాబా చరిత్ర" గ్రంథాన్ని తెప్పించి పారాయణ చేయటం మొదలు పెట్టాను. ఒకరోజు వెంకటగిరిలో ఏదో ప్రోగ్రామ్ వుండి మాస్టరుగారు చాలా పొద్దుపోయి సూళ్ళూరు పేటకొచ్చారు. అది జనవరి నెల. పండుగనెల కదా! అందుకని ఆ లోగిల్లోని ఆడవాళ్ళమంతా పొద్దున్నే లేచి రంగవల్లులు తీర్చిదిద్దుతున్నాము. ఇంతలో మాస్టరుగారు బ్రెష్ చేసుకుంటూ బయటకొచ్చారు. అదే నాకు వారిచ్చిన ప్రథమ దర్శనం. భాస్కరరెడ్డి వుండి "మాస్టరుగారూ నీళ్ళు తెచ్చిస్తాను. ఇక్కడే కడుక్కోండి" అని అంటే నావైపు చూస్తూ ఎంతో మృదువుగా ఆత్మీయంగా "అమ్మాయ్ వాళ్ళు ముగ్గేసుకుంటున్నారు పాడై పోతుంది కదా వద్దులే" అంటూ లోపలి కెళ్ళపోయారు. ముందు ముందు జీవితం పొడుగునా వారి పరిచయ భాగ్యాన్ని ప్రసాదించడానికి నాందియైన ఆ ప్రథమ దర్శన దృశ్యం నా స్మృతి పథంలో ఇప్పటికీ, ఎప్పటికీ నిత్య నూతనంగా నిలచి, తలచుకున్నప్పుడెల్లా మనసంతా ఆనందంలో నిండిపోతుంది. ఆ తర్వాత భాస్కర్‌రెడ్డి ఒక రోజు వచ్చి "గురువుగారు వచ్చారు. మీరు వచ్చి దర్శనం చేసుకోండి" అని" పిలిచారు. కానీ నేను వెళ్ళలేని, వెళ్ళకూడని పరిస్థితి. అందువల్ల మావారిని వెళ్ళి గురువుగారిని దర్శనం చేసుకోమని ఎంతగానో ప్రాధేయపడ్డాను. ఏ కళనున్నారోగాని వెళ్ళి వారిని దర్శించుకొచ్చారు. తర్వాత మళ్ళీ శ్రీహరికోటలో సత్సంగానికెళ్తూ సూళ్ళూరిపేట కొచ్చారు. అప్పుడు నేనెంతో సంతోషంగా వెళ్ళి దర్శనం చేసుకున్నాను. నన్ను చూడగానే "బాగున్నావా అమ్మా!" అని ఎంతో పరిచయమున్నట్టు, ఆత్మీయంగా పలకరిస్తూనే కొన్ని వస్తువులు పొట్లం కట్టి ఇచ్చి "రోజూ తులసి దళాలతోగాని, అక్షింతలతోగాని పూజించుకోమ్మా" అన్నారు. ఆ రోజు సాయంత్రం

సత్సంగానికెళ్తూ మా యింటికొచ్చారు మొట్టమొదటిసారిగా. కొంచెంసేపు కూర్చున్నారో లేదో, సూర్యప్రకాశ రావుగారొచ్చి సత్సంగానికెళ్ళాలంటూ తొందర చేస్తుంటే "అమ్మాయి కాఫీ యిస్తానంటున్నదయ్యా తాగి వెళ్తాం" అంటూ నేనిచ్చిన కాఫీ తాగే వెళ్ళారు. ఆ తర్వాత విద్యానగర్ లో వారిని చూడటానికి అడపాదడపా వెళ్ళేవాళ్ళం. అలా వారి దగ్గరకు మా రాకపోకలు ప్రారంభమైనాయి. మావారు ఇంజనీరు అవటం మూలాన విద్యానగర్ లోని మందిర నిర్మాణ కార్యక్రమం గురించి వారితో మాట్లాడుతుండేవారు.

ఒకసారి వంట్లో బాగలేక డాక్టర్ గారి దగ్గరకెళ్ళాను చూపించుకుందామని. ఆయన చూసి మద్రాసులోని షీలా రాజారత్నంగారి దగ్గరకెళ్ళి ఒకసారి చూపించుకుని రమ్మన్నారు. ఆమె చూసి నాతో ఏమీ చెప్పకుండా మందులు రాసిచ్చారు. అవి వాడుకుని రమ్మన్నారు. ఆ తర్వాత తెల్సింది గర్భ సంచీలో పుండుంది, అందుకని పదిరోజులు మందులు వాడుకున్న తర్వాత పెద్ద ఆపరేషన్ చేయాలని. అప్పుడు నాకెంతో బాధవేసింది. చూడబోతే ఇద్దరూ చిన్నపిల్లలు, ఈయనకా పెద్దగా బాధ్యత తెలీదు. అందుకని మాస్టరుగారి దగ్గరకెళ్ళి నేను ఆపరేషన్ చేయించుకోనని ఏడ్చాను. అప్పుడు మాస్టరుగారు "అఖ్ఖర్లేదులే" అని ఊదీ ఇచ్చారు. అదిసుతా ఆవాల్టి నుంచి ఇవాల్టి వరకు ఆ నొప్పి మళ్ళీ కన్పించలేదు. అట్లా మాకే బాధ వచ్చినా, వారికి చెప్పుకుంటాము. ఆయన చెవిన వేస్తే ఆయనే చూసుకుంటారు అన్న ధైర్యం, నమ్మకం వుంది ఎప్పుడూ. వారు సర్వసమర్థులు.

అలా రెండేళ్ళు గడిచాయి. ఈ రెండేళ్ళలో సూళ్ళూరి పేట నుండి విద్యానగర్ కి అస్తమానం వెళ్తుండటం వల్ల మాస్టరుగారితోటి, వారి కుటుంబంతోటి బాగా పరిచయం పెరిగి వారిపట్ల గౌరవాభిమానాలు రోజురోజుకూ పెరగసాగాయి. వారిని దర్శిస్తే చాలు ఎంతో ప్రశాంతంగా వుండేది. అందువల్ల ఎంత తరచుగా వీలయితే అంత తరచుగా వారి దగ్గరకు వెళ్తూండే వాళ్ళం. అందువల్ల విద్యానగర్ కి దూరంగా వున్న ఒంగోలుకు ట్రాన్స్ఫర్ అవటం నాకెంతో బాధగా వుందని మాస్టరుగారికి చెప్పుకుని ఎంతగానో బాధపడుంటే మాస్టరుగారు "అసలు నువ్వు ఒంగోలు వెళ్ళడానికి ఎందుకంత బాధపడ్తున్నావో చెప్పు" అని అడిగారు. "ఇక్కడుంటే దగ్గర కాబట్టి అస్తమానం వస్తున్నాం సార్, అక్కడికెళ్తే దూరం అవటం మూలాన ఈయన అస్తమానం విద్యానగర్ తీస్కెళ్ళలేరు. నాకై నేను ఒంటరిగా రాలేను, మిమ్మల్ని చూడలేను కదా మాస్టరుగారు" అని ఎంతో బాధగా చెప్పాను. అప్పుడు మాస్టరుగారుండి "నువ్వు రానఖ్ఖర్లేదు. అప్పుడప్పుడు వచ్చి దర్శనం ఇస్తాను. నువ్వు రావద్దు. నువ్వెళ్ళి తీరాలి" అన్నారు. అలా అన్న తర్వాత సంతృప్తి పడ్డాను.

ఒంగోలు వచ్చేశాము. అప్పట్లో లాయరు పేటలో ఇల్లు అద్దెకు తీసుకుని వున్నాము. మొదట్లో ఏమీ తోచేది కాదు. అంతా కొత్త. ఇక్కడివారికి బాబా గురించి అంతగా తెలియదు. మేము సాయంత్రం పూట బాబాకు హారతి యిచ్చి భజనలు చేస్తుంటే, మా పిల్లలతో చదువుకునే పిల్లలు, చుట్టుప్రక్కలుండే పిల్లలు వస్తూండేవారు. అలా మొదట్లో సత్సంగానికి ఎక్కువ మంది పిల్లలే వచ్చేవారు. ఆ తర్వాత పెద్దవాళ్ళు రావటం మొదలు పెట్టారు. మాస్టరుగారు కూడా అప్పుడప్పుడు వస్తూండేవారు. వచ్చినప్పుడు జె.వి.సుబ్బయ్య మాస్టరుగారింట్లో దిగేవారు. మాస్టరుగారు వచ్చి సత్సంగాలు చేస్తుండటం మూలాన వారితో పరిచయం పెరిగి రాను రాను వారిని చూడటానికి ఎంతోమంది వచ్చేవారు.

ఒంగోలులో జరిగే నాస్తికులతో చర్చలకు ఒక రోజు

మాస్టరుగారు వస్తున్నారని మావారు స్టేషన్ కి బయల్దేరుతూ "నువ్వు కూడా వస్తావా?" అని అడిగారు. అక్కడికెళ్ళినా వారిని కలసి మాట్లాడ్డానికి కుదరదులే అని నేను రానన్నాను. సరే అని ఈయన వెళ్ళారు. అలా వెళ్ళారో లేదో మళ్ళీ వెంటనే వచ్చేశారు. ఏమిటండీ అని అంటే "మాస్టరుగారు వస్తున్నారని" చెప్పారు. నాకెంతో ఆశ్చర్యం వేసింది. ఒకటే కంగారు. ఇంతలో ఆయన రానే వచ్చారు. వస్తూనే "ఎందుకమ్మా మీరు అక్కడకు వచ్చి నాతో మాట్లాడే అవకాశం వుండదని బాధపడ్డావు కదా! అందుకని నేనే వచ్చానమ్మా" అని అన్నారు. నాకెంతో ఆనందం కలిగింది. మాస్టరుగారికి మనం మనస్సులో ఏమనుకున్నదీ తెలుస్తుంది. ఆయనకు మనం ఏమీ చెప్పనక్ఖర్లేదు. వారు సర్వజ్ఞులు అని అనిపించింది. చర్చలు అయిపోయినాయి. అప్పుడు మాటల్లో అన్నారు. అమ్మగారి హెల్త్ అంత బాగుండటం లేదు. ఈసారి ఆమెను డెలివరీకి ఉమా అయ్యర్ గారు హైద్రాబాద్ కి తీసుకెళ్తామంటున్నారని చెప్పారు. అంతకు ముందు ఒక బాబు పుట్టి పోయాడు. అందుకని హైద్రాబాద్ లో అయితే బాగుంటుందని అనుకున్నారేమో ఆ ఉమా అయ్యర్ ఎంత అదృష్టవంతురాలో మాస్టరుగారికి, వారి కుటుంబానికి సేవ చేసుకుంటున్నారని అనుకున్నాను. అప్పటికే మాస్టరుగారి బావమరిది సత్యంగారు, వారి అన్న కుమారుడు విక్రం అంతా ఒంగోలు ప్రెస్ లో వర్క్ చేస్తూ ఇక్కడే వున్నారు. వాళ్ళంతా "మేమంతా ఇక్కడే వున్నాము కదా! ఈ వూళ్ళో కూడా మంచి డాక్టర్సే వున్నారు, డెలివరీకి ఇక్కడికొస్తే బాగుంటుందని" అన్నారు. అమ్మగారు కూడా మాస్టరుగారికి ఒంగోలు దగ్గరవటం వల్ల వచ్చి వెళ్ళటానికి బాగుంటుందని అనటంచేత ఆమెను ఒంగోలు తీసుకొచ్చారు. అందరమూ ఆమెకు సీమంతపు వేడుకను ఎంతో ఆనందంగా జరుపుకున్నాం. (అప్పట్నించి మాస్టరుగారు శ్రీమతి సుబ్బలక్ష్మిగారిని 'అత్తగారు' అనేవారు. సాయి శ్రీమతి లక్ష్మీబాయి నమస్కరించగనే ఆమెను పరిహాసంగా తమ అత్తగారని చెప్పారు. అది వారు ఆమెను తన శిష్యురాలిగా అంగీకరించటానికి చిహ్నమేమో అని దాదాసాహెబ్ ఖాపర్డే తన డైరీలో రాసుకున్నారు. ఆ విధంగానే శ్రీమతి సుబ్బలక్షిగారిని తన శిష్యురాలిగా అంగీకరించినట్లు మనం అనుకోవచ్చు కదా! – సంకలన కర్త)

హాస్పిటల్లో సుఖప్రసవమైంది. ఆ విధంగా బుజ్జిగాడి (ద్వారకానాథ్) పుట్టుక వల్ల వారి కుటుంబానికి చేరువయ్యే అదృష్టం కల్గింది. ఆ తర్వాత మాస్టరుగారికి బాబా కలలో వచ్చి ముమ్మారు విద్యానగర్ వెళ్ళవద్దు అని స్వప్న సందేశమిచ్చినందువల్ల అప్పటికే అక్కడ నెలకొన్న కొన్ని అనుకూల పరిస్థితులలో బాబా యిచ్చిన స్వప్న సందేశాన్ని ఆజ్ఞగా స్వీకరించి చివరకు ఒంగోలు వచ్చి స్థిరపడటం జరిగింది.

ఒకసారి మాస్టరుగారు ఒంగోలు వచ్చినప్పుడు మా యింటికొచ్చారు. అప్పుడు ఆయన "నీకు ఏం కావాలమ్మా. నీకు ఏమి కావాలను కుంటున్నావమ్మా నువ్వు " అని అడిగారు. అప్పుడు నేను పూలు కడుతూ కూర్చున్నాను. వారు ఇలా అడిగినప్పుడు నేను మామూలుగా, లౌకికంగా "పిల్లలిద్దరూ మంచి చదువులు చదువుకొని, ఫలానా వారి పిల్లలు వారి బ్రతుకు వారు బ్రతుకుతున్నారని, నలుగురిలో మంచిగా అనుకోవాలని, వుండటానికి ఒక ఇల్లు కావాలని వుంది సార్" అని నా కోర్కెలను తెలియపరచాను. "అదేముందమ్మా అవేమీ కోరరాని కోర్కెలు కాదే. అవి అందరూ కోరుకునేవే కదా !" అన్నారు. ఆయన అంతకంటే మంచివి యిద్దామను కున్నారేమో! కానీ నా అల్ప బుద్ధికి మటుకు అవే కావాలన్పించి వాటినే కోరుకున్నాను. 1982లో అప్పుచేసి స్థలం కొనుక్కున్నాం.

పిల్లలిద్దరూ అప్పుడు మా దగ్గరే వుండి చదువుకుంటున్నారు. స్థలం కొనుక్కోగానే పెద్దవాడు పాలిటెక్నిక్ కి అప్లై చేస్తూ, తమ్ముడికి నాకంటే టెన్త్ లో మంచి మార్కులొచ్చాయి కదా అని వాడిచేత కూడా అప్లై చేయించాడు. సీటు గురించి కనుక్కుంటే పెద్దాడి కొచ్చేటట్టు లేదు. కానీ చిన్నాడికి మాత్రం వస్తుందని చెప్పారు. అలానే చిన్నవాడికి హైద్రాబాద్ లో సీటు వస్తే మాస్టరుగారు చెప్పారని వాడిని అక్కడే చేర్పించాము. పెద్దవాడిని మైనింగ్ కోర్సులో గూడూరులో చేర్పించాము. అలా వాళ్ళిద్దరికీ నెలనెలా డబ్బు పంపాలి. ఇక్కడ మేము ఇల్లు గడుపుకోవాలి. అందువల్ల ఆర్థికంగా మేమెంతగానో యిబ్బంది పడ్డాము. స్థలం కోసం తీసుకున్న అప్పు తీర్చలేక పోయాము. 1985 దాకా అప్పు తీర్చలేకపోయాము.

- సశేషం

(గత సంచిక తరువాయి)

సపత్నేకర్

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

మరురోజు గురువారం చావడి ఉత్సవం గూడ చూడడానికి మేము శిరిడీలో వుండిపోయాము. భక్తులు ముందుగా సాగుతూ, మేళతాళాలతో నృత్యం చేస్తున్నారు. వారి వెనకాలే ఛత్ర చామరాలు, పల్లకీలతో కలసి బాబా నడుస్తున్నారు, కానీ ఆయనెన్నడూ పల్లకీలో కూర్చోలేదు. భక్తులు బలవంతంగా ఆయనను ఎత్తి పల్లకీలో కూర్చోబెడితే మరుక్షణమే ఆయన మాయమై యథాపూర్వం దాని వెనకాలే నడుస్తూ కనిపించేవారని చెప్పుకొనేవారు. ఒక్కొక్కప్పుడు బాబా ఒకసారి ఒక అడుగు, మరొకసారి మరొక అడుగు ముందుకువేస్తూ, ఆరితేరిన నర్తకునిలా నృత్యం చేస్తుండేవారు. అదెంతో రమ్యమైన దృశ్యం! నాకిప్పటికీ కళ్ళకు కట్టినట్లుంది! ఆయన ముఖంలో తాండవించే ఆ దివ్యవర్చస్సు ఒకసారి పండరిపురంలోని పాండురంగని ముఖంలో మాత్రమే చూచాను.

మరురోజు మేము శిరిడీ నుండి బయలుదేరుతున్నాము. బాబా దర్శనానికి వెళుతుండగా మావారు నాతో, "బాబాకొక రూపాయి దక్షిణిస్తాను, ఆయనింకా కావాలని కోరితే నేను నా బంగారు ఉంగరము, నీ గాజులు గూడ అమ్మవలసి వస్తుంది" అన్నారు. మేము బాబాను దర్శించినపుడు మావారు ఆయన చేతిలో ఒక రూపాయి వుంచగానే ఆయన మరొక్క రూపాయి మాత్రమే అడిగి, "నేనింకెక్కువ అడగను, అడిగితే నీవు నీ బంగారు వుంగరము, నీ భార్య గాజులు అమ్మవలసి వస్తుంది" అన్నారు. అది వినగానే మావారిలో మిగిలివున్న కొద్ది సంశయాలూ తొలగిపోయి, వారి దైవత్వాన్ని పూర్తిగా విశ్వసించారు.

సరిగ్గా ఒక్క సంవత్సరంలోనే, అనగా 1915లో మా అబ్బాయి మురళీధరుడు జన్మించాడు. వాడికి 8 మాసాలపుడు బాబా దర్శనానికి తీసుకెళ్ళాము. తర్వాత నాకు భాస్కర్, దినకర్ అను మరియిద్దరు కొడుకులు కలిగారు. వాళ్ళను గూడ బాబా దర్శనానికి తీసుకువెళ్ళాము. దినకర్ ను రెండుమూడు మాసాల పిల్లవాడపుడు బాబా పాదాలవద్ద వుంచగానే బాబా వాణ్ణి చేత్తోపట్టి పైకిలేపి, పైకి బలంగా ఎగురవేసారు. ప్రక్కనున్న భక్తులెవరో వాణ్ణి పట్టుకున్నారు, వాడికేమీ జరుగలేదు. మొత్తంమీద నాకు ఎనిమిదిమంది కొడుకులు, ఒక కూతురు కలిగారు. అలనాడు నాకు ఊదీ యిస్తూ బాబా నాతో "తీసుకో, ఒకటి, రెండు, మూడు, నాలుగు ఎందరుకావాలంటే అందరు!" అన్నారు. ఆయన తనమాట నిజంగా నిలబెట్టుకున్నారు.

నాకు మురళీధరుడు జన్మించాక మావారి భక్తి దృఢమై బాబాపట్ల ఎంత విశ్వాసమేర్పడిందంటే, మా రెండవ అబ్బాయి భాస్కర్ పదవయేట చనిపోయినపుడు మా మిగిలిన పిల్లలనందరినీ బాబా పటం ఎదురు నిలబెట్టి, 'బాబా కావాలంటే వీరినందరినీ గూడా తీసుకుపోండి, నేనేమీ బాధపడను. మీపై భక్తిని మాత్రం విడువను' అని ప్రార్థించారు.



(గత సంచిక తరువాయి)

మహాయోగి శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రి గారు

శ్రీమతి శ్రీదేవి

ఏ ఊరికి వెళ్ళినా శ్రీ కోటయ్య శాస్త్రిగారు ఆ ఊరిలో ఒక్కరోజు మాత్రమే వుండేవారు. దేవీ పూజలు నిర్వహించే సమయంలో ఆయన భక్తులందరికీ లలితా దేవి మహత్యాన్ని వివరించి చెప్పేవారు. ఆ దేవిని నమ్మి ఆమెను ఆరాధించడం శుభప్రదమని బోధించేవారు. దేవీ భజనలు చేయించేవారు. అలా శ్రీ కోటయ్య శాస్త్రిగారు ప్రజలలో దైవభక్తిని పెంపొందించారు. ఆయన రాకతో ఆయా గ్రామాలలో ఎన్నో శుభాలు జరిగేవి. ఎన్నో ఆపదలు నివారింపబడేవి. ఆయన దర్శనం, ఆయన సన్నిధి ప్రజలకు శాంతి సుఖాలనిచ్చేవి.

శ్రీ శాస్త్రిగారి నిస్వార్థత, దానగుణం, దయాగుణం అపారం. తనకంటూ ఏమీ దాచుకునేవారుకాదు. ఉన్నదంతా అడిగిన వారికి లేదనకుండా పంచిపెట్టేవారు. తరచుగా వున్నంతలో పేదసాదలకు అన్నదానం చేసేవారు. ఆయన అన్నదాన కార్యక్రమం చేయాలని సంకల్పిస్తే ఆ సమయానికి ఇంట్లో ఏమీ సరుకులు, ధనం లేకున్నా అప్పటికప్పుడు ఏదో ఒకరకంగా అన్ని సమకూరి అన్నదాన కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగిపోయేది. తనకి ఎవరైనా ధనధాన్యాలు, వస్త్రాలు, కానుకలు సమర్పిస్తే మరుక్షణమే వాటిని నిరుపేదలకు పంచేసేవారు. ఏ ఊరికి వెళ్ళినా ఆ వూరి ప్రజలు శాస్త్రిగారికి, వారి కుటుంబ సభ్యులకు యిచ్చిన కానుకలన్నింటిని ఇతరులకు యిచ్చేసేవారు శ్రీ శాస్త్రిగారు.

శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రిగారి దాతృత్వానికి, త్యాగనిరతికి పరాకాష్టగా నిలిచిన ఒక సంఘటన ఈ క్రింది విధంగా వుంది.

ఆయన ఒకసారి కుటుంబ సమేతంగా భద్రాచల క్షేత్రానికి వెళ్లారు. అందరూ గోదావరి నదిలో స్నానాలు చేశారు. ఆ తర్వాత శ్రీ శాస్త్రిగారు నదీతీరాన కూర్చుని అనుష్టానం చేసుకుంటున్నారు. అదే సమయంలో శాస్త్రిగారి ఊరికి సమీప గ్రామస్థుడొకరు నదీస్నానం చేసివస్తూ అక్కడే అనుష్టానం చేసుకుంటున్న శాస్త్రిగారిని చూశాడు. ఆయన మహాయోగి శ్రీ కోటయ్య శాస్త్రిగారు అని గుర్తించి ఎంతో ఆనందంతో వారి అనుష్టానం పూర్తి అయ్యేవరకు ఆయన సమీపాన కూర్చున్నాడు. అనంతరం చేతులు జోడించి శాస్త్రిగారితో, "మహానుభావా! ఈరోజు నా పుణ్యం పండింది. ఈ మహాపుణ్యక్షేత్రంలో ఆ శ్రీరామచంద్రుడే నాకు మీ దర్శనభాగ్యాన్ని ప్రసాదించాడు. నా జన్మ ధన్యమైంది. ఈ సంతోష సమయంలో నాదొక ప్రార్థన. పరమభాగవతోత్తములైన మీవంటివారికి యిటువంటి పుణ్యక్షేత్రాల్లో చేసే మహాదానాలు అపార శ్రేయస్సును చేకూరుస్తాయని చెబుతారు. దయతో తమకు నేనివ్వబోయే దానాలను స్వీకరించి నన్ను కృతార్థుడిని చేయండి" అని ప్రార్థించాడు. శాస్త్రిగారు అంగీకరించారు. ఆ వ్యక్తి గొప్ప ధనికుడు కావడంతో ఎన్నో విలువైన కానుకలతోపాటు శాస్త్రిగారి భార్యాబిడ్డలకు ఎన్నో బంగారు నగలు కూడా దానమిచ్చాడు. గోదానము, భూదానము, ధనధాన్యాలు వెండిపాత్రలు కుటుంబమంతటికీ ఖరీదైన పట్టువస్త్రాలు సమర్పించుకున్నాడు. శాస్త్రిగారు వాటిని సాదరంగా స్వీకరించటంతో ఆ వ్యక్తి పరమానందంతో శాస్త్రిగారికి మరల మరల సాష్టాంగ నమస్కారాలాచరించి వారి వద్ద సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆ వ్యక్తి వెళ్లిపోయిన తర్వాత శ్రీ కోటయ్య శాస్త్రి గారు చుట్టూ పరికించి చూశారు కొద్ది దూరంలో ఒక నిరుపేద బ్రాహ్మణుడు కూర్చుని అనుష్టానం చేసుకుంటూ కనిపించాడు అతని సమీపంలోనే అతని భార్యాబిడ్డలు కూడా ఉన్నారు శ్రీ కోటయ్య శాస్త్రి గారు అతనిని పిలిచి ఇంతకుముందు ఒక ధనిక వ్యక్తి వద్ద తాను దానం స్వీకరించిన సకల వస్తువులను ఆ నిరుపేద బ్రాహ్మణుడి కిచ్చారు. అది చూచిన శ్రీ కోటయ్య శాస్త్రిగారి భార్య, "మీరు యిలా చేశారేమిటి? మనకు కుటుంబం, బిడ్డలు వున్నారు. మనం ధనవంతులం కాము. మీకు ఎటువంటి సంపాదన లేకపోయె. ఈనాడు ఈ మహాపుణ్యక్షేత్రంలో అనుకోకుండా మనకు ఈ సంపదలన్నీ లభించాయి. సాక్షాత్తూ ఆ రామచంద్ర ప్రభువే మనకు ఆ వ్యక్తిరూపంలో వచ్చి యివన్నీ ప్రసాదించాడేమో. ఇదంతా దేవి అనుగ్రహంగా గుర్తించి స్వీకరించవచ్చు కదా" అన్నది.

శ్రీ శాస్త్రిగారు నవ్వుతూ "మన కళ్ళ ఎదురుగా కనిపిస్తున్న ఈ నిరుపేద బ్రాహ్మణుడిని చూడు. వారిని చూస్తుంటే ఆ కుటుంబం ఎంతటి దీనస్థితిలో ఉన్నదో, ఎంత పేదరికాన్ని వారు అనుభవిస్తున్నారో అర్థం అవుతున్నది. ఈ కానుకలన్నీ వారికిచ్చినట్లయితే ఈ ధనధాన్యాలతో కొన్నాళ్ళయినా వారు సుఖంగా జీవిస్తారు కదా! ఇప్పుడు మనకు ఆ జగన్మాత దయవలన అన్నవస్త్రాలకు లోటులేకుండా గడిచిపోతున్నది. మన నిత్య జీవితావసరాలకు ఏ లోటూ రాకుండా మన యోగక్షేమాలన్నీ ఆ దేవియే చూసుకుంటున్నప్పుడు మనకు ఇంక ఏమి కావాలి? ఆ తల్లి పై చెక్కుచెదరని భక్తి అనే సంపదకు మించిన భాగ్యం మరొకటి ఉందా? లలితా మాతను అది ఒక్కటే మనం కోరాలి. సిరిసంపదలు మనకెందుకు?" అని బదులిచ్చారు. ఈ సన్నివేశాన్ని కళ్లారా చూసిన అచ్చటి ప్రజలు శాస్త్రిగారి త్యాగశీలతను చూసి ఆశ్చర్యపోయారు.

మనుషుల పైననే కాదు, సమస్త జీవజాలం పైనా ఆయన అమిత దయ చూపేవారు. పశుపక్షాదులకు కూడా ఆహారం యిచ్చేవారు. వేసవికాలం వచ్చిందంటే శాస్త్రిగారు చిన్నచిన్న మట్టి మూకుళ్ళలో నీరు నింపి జంతువుల, పక్షుల దాహం తీర్చడం కోసం ఊరిలో అక్కడక్కడ ఆ మూకుళ్ళు పెట్టివచ్చేవారు. ఆవులు, గేదెల కోసం నీటి తొట్లను కూడా ఊరిలో పలుచోట్ల వుంచేవారు. ప్రజల కోసం చలివేంద్రాలు పెట్టేవారు. చీమల పుట్టల వద్ద నూకలు పోసేవారు. కుక్కలకు, కాకులకు, పందులకు కూడా ఆహారం యిస్తుండేవారు.

గుంటూరు జిల్లాలోని పొన్నూరు పట్టణానికి సమీప గ్రామమైన మన్నవ అనే ఊరికి ఒకసారి శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రిగారు ఆ గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు వెళ్లడం జరిగింది.

ఈ సందర్భంలో ఇక్కడ మన్నవ గ్రామ విశిష్టతను గురించి కొంత చెప్పుకుందాం.

గుంటూరు జిల్లాలో గుంటూరుకు 20 మైళ్ళ దూరంలో మన్నవ అనే గ్రామం ఉంది. ఆ గ్రామ ప్రజలు ధర్మాత్ములు, దాన నిరతులు, దైవ చింతనాతత్పరులుగా వుండేవారు. ఊరి మధ్యలో శ్రీ రాజరాజేశ్వరి ఆలయం వుంది. ఆలయంలోని ఆ దేవి గ్రామ పెద్దలకు స్వప్న దర్శనమిచ్చి గ్రామ సంక్షేమం కోసం ఆదేశాలిస్తుండేది. గ్రామ శివారులో పోతురాజు స్వామి గుడి వుంది. గ్రామ ప్రజలకు ఎవరైనా కీడు తలపెట్టినా, గ్రామానికి ఏదైనా ఆపద సంభవించబోతున్నా పోతురాజు స్వామి ముందుగానే ఆ విషయాన్ని గ్రామ పెద్దలకు స్వప్నాలలో దర్శనం యిచ్చి హెచ్చరించటం జరిగేది.

'ధర్మో రక్షతి రక్షితః' అన్న సూక్తి ప్రకారం ధర్మాత్ములైన ఆ గ్రామ ప్రజలను దేవతలు ఆ విధంగా కాపాడుతుండేవారు.

ఆ గ్రామ ప్రజల దైవభక్తికి మెచ్చి ఎందరో మహాత్ములు ఆ గ్రామంలో జన్మించారు. వారిలో ఒకరు శ్రీ మన్నవ హనుమంతయ్యగారు. నిరంతర హనుమత్ ఉపాసన చేసే శ్రీ హనుమంతయ్యగారికి శ్రీ ఆంజనేయుడు సాక్షాత్కరిస్తుండేవారు. ఆయన తరచూ హనుమాన్ చాలీసా సామూహిక పారాయణలు చేయిస్తుండేవారు. అలా ఒకసారి పారాయణజరుగుతుండగాపారాయణ మధ్యలో హనుమంతయ్యగారు గట్టిగా "అబ్బా" అని కేక పెట్టారు. అందరూ పారాయణ ఆపి కంగారుగా ఏమైందని అడగగా, "నేను పారాయణ చేస్తూ మధ్యలో ఒక వాక్యం పొరపాటున తప్పుగా ఉచ్చరించాను అందుకు స్వామి కోపించి తన తోకతో నా వీపు మీద గట్టిగా కొట్టారు. అందుకే నేను నొప్పితో అలా గట్టిగా అరిచాను" అంటూ హనుమంతయ్యగారు తన చొక్కాను పైకెత్తి చూపగా, ఆయన వీపు మీద పొడవుగా పెద్ద వాత పెట్టినట్లుగా చర్మం కంది, వాచిపోయి వుండటం చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

- సశేషం

ద్వారకామాయి అనుభవమండపము

శ్రీ నరేష్ రావులపల్లి

మాది ఒంగోలు దగ్గర సంతనూతలపాడు గ్రామం. శిరిడి సాయినాథులవారు నా జీవితంలోకి విచిత్రంగా ప్రవేశించి, ఇప్పుడు వారే నా జీవితం అయ్యారు.

చిన్నప్పుడు అంటే 5 వ తరగతి చదివేటప్పుడు మా అమ్మతో బాబా గుడికి వెళ్ళేవాడిని. తరవాత పెద్దైన కొద్దీ వెళ్ళటం తగ్గించాను. మళ్ళీ ఇంటర్మీడియట్ లో చేరాక, అమ్మతో గుళ్లో జరిగే భజనలకి, సత్సంగాలకి హాజరయ్యేవాడిని. నా ఇంటర్ పూర్తి అయ్యాక, ఎం.సెట్ తర్ఫీదు పొందాక, ఇంజనీరింగ్ లో ఏ గ్రూప్ తీసుకోవాలో నిర్ణయించుకోలేకపోయాను. గ్రూపులన్నీ ఒక్కొక్క చీటీలో రాసి మొట్టమొదటిసారి బాబాగారి ముందరపెట్టాను. సివిల్ గ్రూపులో చేరమని వచ్చింది. మంచి కాలేజీలో సీట్లన్నీ దాదాపు అయ్యిపోయాయి. కానీ నాకు చివరి క్షణంలో బాబా దయవల్ల ఒంగోలు JNTU కాలేజీలో సీటు వచ్చింది. మా అమ్మా నాన్న నేను ఇంజనీరింగ్ మొదలు పెట్టినప్పటినించి ప్రతి సంవత్సరం శిరిడి వెళ్ళేవాళ్ళు. నేను వెళ్ళేవాడిని కాదు. బాబా ముందు చీటీ అయితే వేసి ఆయన చెప్పినట్టు చేసినా, వారిమీద నాకు భక్తిభావం దృఢ పడలేదు. కానీ నా దృక్పథంలో మార్పువచ్చింది. ధర్మంగా వుండడం, నీతి నిజాయితీల గురించి ఆలోచనలు వచ్చేవి. చివరికి ఇంజనీరింగ్ నాలుగవ సంవత్సరంలో అమ్మానాన్నలతో కలిసి శిరిడి మొట్టమొదటిసారి వెళ్లాను. అది 2018 వ సంవత్సరం, నవంబర్ నెల!

అక్కడ నాలుగైదు రోజులున్నాము. నాన్న నాకు పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు సూచించిన ప్రదేశాలన్నీ చూపించారు. చివరి రోజు మాకు అక్కడ గురుపుత్రిక వేదమ్మగారు కలిసారు. కొంతసేపు మాట్లాడారు. నాన్న వాళ్ళు చాలా సంతోషించారు. మేము తిరుగుప్రయాణం అయ్యే సమయం అవడంతో బయలుదేరాము. నేను మా అమ్మతో, “అమ్మా! మనం ఇన్ని రోజులు ఇక్కడ గడిపాము కదా, నాకేమీ ప్రత్యేకంగా అనిపించటం లేదు. మీరు పారాయణలతో, క్షేత్రదర్శనంతో తృప్తి పడ్డారేమోకాని, నాకేమంత తృప్తిగా అనిపించటం లేదు. నేను ఇక్కడకి వచ్చాక ఆయన నాకు ప్రత్యేకమైన అనుభవమేమీ ప్రసాదించలేదు. మరి ఈ దర్శనం వల్ల నాకేం ప్రయోజనం?” అని అడిగాను. “అలా అనకూడదు, ప్రయోజనం తప్పకుండా ఉంటుంది” అంది మా అమ్మ.

మేము శిరిడి నుండి నాగర్ సోల్ రైల్వేస్టేషన్ కి వచ్చాము. రైలు రావడానికి ఇంకా గంట సమయం వుంది. అమ్మానాన్న ఒకచోట కూర్చున్నారు. నాకు మంచి దృశ్యాలుంటే ఫోటో తియ్యడం అలవాటు. నేను కెమెరా పట్టుకుని అలా ప్లాట్ ఫామ్ చివరికి నడుచుకుంటూ వెడుతున్నాను. అప్పటికే చీకటిపడింది. ఈలోపల నా వెనుక నించి, హిందీలో ‘ఇదర్ ఆవో బేటా’ అని వినిపించింది. నేను వెనక్కు తిరిగి చూసాను. ఒకాయన బెంచీమీద

కూర్చుని సిగరెట్ కాలుస్తున్నారు. 55 లేదా 60 మధ్య వయస్సుంటుంది. ఫాంట్ చొక్కా వేసుకున్నారు. మళ్ళీ పిలిచారు. నేను వెళ్లాను. ఆయన పక్కనే ఒక టిఫిన్ పార్సెల్ కూడా వుంది.

ఆయన హిందీలో "నిన్నెవడ్రా శిరిడి రమ్మన్నది, నీకిక్కడేం పని?, బాబా మీ ఇంటిదగ్గర కూడా వున్నాడు, ఎందుకొచ్చావురా?" అని తిట్టేస్తున్నారు. నాకేమీ అర్థం కాలేదు, నేను కదా శిరిడి వచ్చింది, ఆయనెందుకు నన్ను 'ఎందుకొచ్చావ్' అని అడుగుతున్నారనిపించింది. నేను వెంటనే, "మేము ఆంధ్రా నించి వచ్చామండి, నాకు హిందీ రాదు" అన్నాను. ఆయన తిట్టింది నాకు అర్థమయ్యింది, కానీ మళ్ళీ సమాధానం చెప్పలేను, అందుకని అలా చెప్పాను. ఆయన వెంటనే, 'ఓహ్,, తెలుగబ్బాయివా, మాదీ విజయవాడే కూర్చో"అన్నారు. సరేనని కూర్చున్నాను. నాతో మాట్లాడుతూ మాట్లాడుతూ, నా భవిష్యత్తు ప్రణాళిక గురించి అడిగారు. ఇప్పుడు నేను ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నానని, నాకు సినిమారంగం అంటే కూడా ఆసక్తి వున్నదని, సందేశాత్మకమైన సినిమాలు తీసే దర్శకుడి దగ్గర సహాయ దర్శకుడిగా పనిచెయ్యాలనుందని చెప్పాను. వెంటనే, "ఒద్దు బాబు, అక్కడ నిన్ను మోసం చేస్తారు" అన్నారు. "మరి ఏం చెయ్యాలి?" అని అడిగాను. ఈలోగా ఆ స్టేషనులో పనిచేసే ఉద్యోగి ఒకతను అటు వచ్చాడు. వెంటనే ఈయన అతన్ని హిందీలో బాగా తెలిసిన వ్యక్తిలాగా పలకరించారు. నాతోనేమో విజయవాడ వైపు మనిషిలాగ మాట్లాడుతున్నారు., అతనితోనేమో, అక్కడి ప్రాంతానికి చెందినట్టు మాట్లాడారు. నాకు ఆశ్చర్యం వేసింది.

మరల నా వైపుతిరిగి, తత్త్వం చెప్పడం మొదలు పెట్టారు. "ఈ జీవితం శాశ్వతం కాదు. అయితే నిజం ఏమిటి?,,, ఏది శాశ్వతం?,,, ఈ సృష్టి తత్త్వం ఏమిటి?,, మానవ జన్మ లక్ష్యం ఏమిటి? ఇలాంటివన్నీ చెప్తూ,, చివరగా "నీబాధ్యతలు మాత్రం నువ్వు ఖచ్చితంగా నిర్వర్తించాలి. నీ తల్లిదండ్రుల పట్ల పూజ్యభావం కలిగివుండాలి" అని చెప్పారు. ఇంచుమించు 45 నిముషాలు మాట్లాడారు. నాకు అవి వింటున్నప్పుడు మనస్సు ఉద్వేగానికి గురయ్యి కళ్ళ వెంబడి నీళ్లు కారుతున్నాయి. నగ్నసత్యాలలాంటి మాటలు వింటుంటే, ఒకరకంగా భయంవేసింది. నా వయస్సుకి, అప్పటి పరిస్థితులకి అవగాహన కావటం లేదు.

అకస్మాతుగా ఒక మెళకువలాగా వచ్చి నేను వెళ్లిపోవాలన్న ఆలోచన వచ్చింది. మా నాన్న ఫోన్ చేస్తున్నారు కానీ అది నాకేమీ వినిపించటం లేదు. ఆయన చెప్తూనే వున్నారు. అక్కడనించి ఎలా వెళ్లాలా అని ఆలోచిస్తూ, 'నాకు ఆకలేస్తోంది, నేను వెళ్తాను' అని చిన్న అబద్ధం చెప్పాను. వెంటనే ఆయన 'ఇది తీసుకో ' అని ఆయనపక్కనే వున్న పార్సెల్ ఇచ్చారు. అది తీసుకోవాలా వొద్దా అని, ఆ పొట్లం కేసి సందిగ్ధంగా చూస్తున్నాను. ఎందుకంటే చిన్నప్పటి నించి నాకు తెలియని వాళ్ళెవరైనా ఏదైనా ఇస్తే నేను తీసుకోను, ఇన్ని విషయాలు ఆయన నించి విన్నా, నా ప్రమేయం లేకుండా భావోద్వేగానికి గురైనా, నా సహజ స్వభావం అప్పుడు పనిచేసి తీసుకోవడానికి సంశయించాను. అప్పుడు, ఆయన దాన్ని నా చేతిలో పెట్టి, "ఇది నువ్వు తిన్నా, తినకపోయినా, పారేసినా నాకు తెలుస్తుంది" అని చెప్పారు. ఈలోపల మేము వెళ్ళవలసిన రైలు వచ్చింది. ఇక నేనక్కడినించి బయలుదేరాను.

ఆయన దగ్గరనించి వస్తూవుంటే కళ్ళమ్మట నీళ్లు కారుతూనే వున్నాయి. మా అమ్మ నాకు ఎదురొస్తూ, "ఎక్కడికెళ్ళావ్, ఏమైంది?" అనడిగింది. రైలు ఎక్కాక చెప్తానని, జరిగిన విషయం సారాంశం చెప్పాను. ఆ పొట్లం గురించి అడిగితే, "ఆయనే ఇచ్చారులే" అని పక్కన పెట్టాను. అమ్మ దాన్ని విప్పి చూసింది. అది వెజిటబుల్ పలావ్. అమ్మ నన్ను తినమంటే కొద్దిగా తీసుకుని వదిలేసాను. పైగా అమ్మ తింటుంటే, అది సరైన పదార్థం కాకపోతే ఏమైనా అవుతుందేమోనని, 'నువ్వుకూడా తినొద్దు' అని చెప్పాను. కానీ "అన్ని మంచి విషయాలు చెప్పిన ఆయన ఇచ్చారంటే, అది తప్పకుండా ప్రసాదమేనని, అమ్మ మొత్తం తినేసింది. నిజానికి మేమందరం శిరిడీలో టిఫిన్ చేసి బయలుదేరాం. అప్పుడు ఎవరికి ఆకలి కూడా వెయ్యటం లేదు. అమ్మకి వున్న విశ్వాసానికి నాకు ఆశ్చర్యం వేసింది. అమ్మ దాన్ని నిజంగా ప్రసాదం అని భావించి తినేసింది. తరవాత ఆలోచిస్తే, శిరిడీలో అమ్మతో 'ఆయన నాకేం అనుభవం ఇవ్వలేదు' అని అన్నందుకు బాబా నాకు సాక్షాత్కరించి అనుభవం ప్రసాదించారనిపించింది. దానికి గుర్తుగా అమ్మకి ప్రసాదం

మిగతా 29వ పేజీలో

ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీమతి కోటేశ్వరి, గుంటూరు

పూజ్యశ్రీ భరద్వాజ్ మహరాజ్ లీలావైభవాన్ని గుంటూరు వాస్తవ్యులు కోటేశ్వరి గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

మేము గుంటూరులో, కొరిటిపాడులో వుంటాము. 1995 లో మావారు చనిపోయారు. మాకు ఇద్దరు అబ్బాయిలు. మా బంధువుల ఇంట్లో, సత్సంగ సభ్యులు శ్రీమతి జయప్రదగారు అద్దెకి ఉండేవారు. అలా వారితో పరిచయమై వారింటికి సత్సంగాలకి వెడుతూ వుండేదాన్ని. ఎంతో మనశ్శాంతిగా వుండేది.

ఒకరోజు నేను సత్సంగం అయిపోయాక, అక్కడికొచ్చిన వాళ్లందరితో మాట్లాడుతూవుంటే, మా అబ్బాయి (14 ఏళ్ళుంటాయి), "అమ్మా! ఇంటితాళాలు యివ్వు. నాకు పనివుంది, నువ్వు తరవాత రా" అని నా దగ్గర తాళాలు తీసుకుని వెళ్ళిపోయాడు. వాడు కూడా నాతో అప్పటిదాకా సత్సంగంలో వున్నాడు. కాసేపటికి నేను ఇంటికి వెళ్లేసరికి మావాడు "రూ/-500 తీసుకుని వెడుతున్నాను" అని చీటీ రాసిపెట్టి వెళ్ళిపోయాడు. వాళ్ళ నాన్నగారు పోయిన దగ్గరనించి చాలా బాధపడుతూ వుండేవాడు. నాకు ఇది ఇంకొకదెబ్బ. బాగా ఏడుస్తూ వుండేదాన్ని.

మన సత్సంగసభ్యులు శ్రీ సాయి లీలామృతం, శ్రీ గురుచరిత్ర గ్రంథాలు పారాయణ చేస్తే తప్పకుండా సమస్యకి పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. చాలా నిష్ఠగా ఆ రెండు గ్రంథాలు 40 రోజులు పారాయణ చేసాను. అప్పుడు అక్టోబర్ 30, పూజ్యశ్రీ మాస్టరుగారి పుట్టినరోజుకి ఒంగోలు వెడదామని అనుకున్నాము. 28 వ తేదీ రాత్రి, నాకొక స్వప్నం వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక అరుగుమీద కూర్చున్నారు. వారి దర్శనం అయినందుకు నేను చాలా సంబరపడి పోతున్నాను. అక్కడ చాలా మంది దర్శనం కోసం బారులు తీరివున్నారు. నేను వారందరితోపాటు నిల్చొని వున్నాను. ఇంతలో ఎవరో ఒక వ్యక్తి వచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను రమ్మంటున్నారని పిలుచుకుని వెళ్ళాడు. నేను పట్టలేని ఆనందంతో వారి పాదాలకి నమస్కారం చేసుకున్నాను. అలా చాలాసేపు వుండిపోయాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను తట్టి లేపి "ఏం కావాలమ్మా!" అని అడిగారు. "మా అబ్బాయి, మా అబ్బాయి" అంటున్నాను. మెలకువ వచ్చేసింది.

ఒంగోలు వెళ్లివచ్చిన మర్నాడు దిగులుగాకూర్చున్నాను. పారాయణలు అయిపోయాయి, ఒంగోలు కూడా వెళ్లివచ్చాను. పిల్లాడు వెళ్ళిపోయి 40 రోజులకి పైగానే అయ్యింది. ఇంతవరకు ఆచూకీ దొరకలేదు అనుకుంటూ బాధ పడుతుంటే పోస్ట్ లో మా అబ్బాయి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. "నేను వస్తాలే, కంగారు పడకు" అని వుంది అందులో. అది అహ్మదునగర్ నించి వచ్చింది. కనక శిరిడీలో వుంటాడనుకుని, నేను, మా పెద్దబ్బాయి, మా తమ్ముడు శిరిడీకి వెళ్లాం. దానికి కారణమేమంటే, అంతకు ముందు మేము శిరిడీకి వెళ్లివచ్చాం. మా బాబుకి ఆ దారి ఒక్కటే బాగా తెలుసు.

శిరిడీకి వెళ్ళాక, అద్దెకి గదుల కోసం, సాయిప్రసాద్ లో క్యూలో నిల్చున్నాము. అందరికి గదులు యిస్తున్నారు కాని, మాకు మాత్రం యివ్వనంటున్నారు. గదులు ఖాళీ లేవా అంటే వున్నాయి. కానీ మమ్మల్ని మాత్రం 'భక్తనివాస్ లో తీసుకోండి' అంటున్నారు. మేము భక్తనివాస్ కి

వెళ్లిపోయాము. మావాళ్ళు వరుసలో నిల్చున్నారు. నేను బైట కూర్చుని వున్నప్పుడు, అక్కడికి వైజాగ్ నించి ఎవరో భక్తులు కూడా వసతి కోసం వచ్చారు. అందులో ఒకావిడ "ఏమండీ, మేము ఇదే మొదటిసారి శిరిడి రావడం, మాకు ఏమి తెలియదు. మీరు ఇక్కడ చూడవలసినవన్నీ చూపిస్తారా?" అనడిగారు. నేను వచ్చినపని వాళ్లకి వివరించి, నాకు కుదరదని చెప్పాను. "ఇంత శిరిడీలో యెక్కడని వెదుకుతారు?" అన్నారు. "నేనేమీ వెతకను, ద్వారకామాయికి వెళ్లి కూర్చుని ఆయనని ప్రార్థిస్తాను" అన్నాను. "ఎన్ని రోజులని ప్రార్థిస్తారు?" అనడిగారు. "ఎన్నిరోజులైనా అక్కడే కూర్చుంటాను" అని చెప్పాను. వాళ్లకి, మాకు గదులు దొరికాయి. మేము స్నానాలు చేసి, బైటికి రాగానే భక్తనివాస్ పక్కనేవున్న హోటల్ లో మా బాబు కనిపించాడు. మాకు సాయిప్రసాద్ లో గదులు ఎందుకు యివ్వనివ్వలేదో యిప్పుడు తెలిసింది. అక్కడినించే బాబాకి హృదయపూర్వక ప్రణామాలర్పించాము. ఆ వైజాగ్ నించి వచ్చిన వాళ్ళు కలిశారు. మా బాబుని చూసి, ఎక్కడ దొరికాడని అడిగారు. వివరం చెప్పాం. బాబా చేసిన ఈ లీలకి వాళ్ళు కూడా చాలా ఆశ్చర్యపోయారు.

మావారు పోయే సమయానికి మేము పాత పెంకుటింట్లో వుండే వాళ్ళం. అది మా నాన్నగారి ఇల్లు. ఆ ఇంట్లో బాగా ఎలుకలు వుండేవి. ఒక రోజు స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు, "నేను మీ ఇంట్లో వుండను, వెళ్లి పోతున్నాను" అంటున్నారు. నేను బాగా ఏడుస్తూ, "మీరు వెళ్లొద్దు మాస్టరు గారూ" అంటూ పూజ్యశ్రీ మాస్టరుగారిని, బ్రతిమాలుతున్నాను. "సరేలే, వెళ్ళను లేమ్మా!" అని, పూజ్యశ్రీ మాస్టరుగారు, వెనక్కి వచ్చి కూర్చున్నారు. "మర్నాడు పొద్దున్న లేవగానే దేవుడికి దీపం పెడదామని చూస్తే, అక్కడున్న బాబా మాస్టరుగారి పటాలు పడిపోయి వున్నాయి. రాత్రి ఎలుకలు వాటిని తోసేసాయి. అందుకే మాస్టరుగారికి కోపం వచ్చిందనిపించి, ఇల్లు మారిపోవాలని నిర్ణయించుకున్నాను. రెండు వీధుల అవతల ఒక ఇంట్లో మా తమ్ముడుంటాడు. మా ఇల్లు బాగా పాతది. మా తమ్ముడు దానిని తిరిగి కట్టాలని అనుకుంటున్నాడు. అది ఆలస్యమవుతోంది. నేను, గబా గబా నడుచుకుంటూ మా తమ్ముడి దగ్గరకి వెళ్లి, నేను యింకా ఆ ఇంట్లో వుండనని నాకు వచ్చిన కల సంగతి చెప్పి, అద్దెకి ఇల్లు చూడమన్నాను. వెంటనే మా తమ్ముడు నన్ను సముదాయించి, కొన్ని రోజుల్లోనే ఆ ఇల్లు పడగొట్టి వేరే ఇల్లు కట్టించాడు. అప్పటి నించి మా ఇంట్లో సత్సంగాలు చేసుకుంటున్నాము. ఇది జరిగి దాదాపు ఇరవై సంవత్సరాలు అవుతోంది. తరవాత పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల మేము కూడా సొంతంగా ఇల్లు కట్టుకున్నాము.

మా మరదలు ప్రతిరోజూ పాత ఇంట్లో ఎలకలున్నాయి కనుక నేను వుండనని మాస్టరుగారు చెప్పారు, మరి ఈ ఇంట్లో వున్నారా? అనుకునేదిట. తనకి ఒకరోజు స్వప్నంలో మేము సత్సంగం చేసుకునే గదిలో పెట్టుకునే పటంలో పూజ్యశ్రీ మాస్టరుగారు నిజంగా కూర్చున్నట్టు కనిపించారట. తాను ఈ విషయం సత్సంగంలో చెప్పింది.

తరవాత ఒకసారి నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీశైలంలో ఒక చోట కూర్చుని వున్నట్లు స్వప్నం వచ్చింది. నేను పూజ్యశ్రీ మాస్టరుగారికి పాదాభివందనం చేసుకుని మాల సమర్పించుకున్నాను. అక్కడకి దూరంగా ఒకచోట పెద్ద పెద్ద పందిళ్లు వేసివున్నాయి. ఏదో శుభకార్యం జరుగుతున్నట్టు, హడావిడిగా వుంది.. పూజ్యశ్రీ మాస్టరుగారు అక్కడ పూజ్యశ్రీ అమ్మగారున్నారని నాకు చెప్పారు. మెలకువ వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారిని కలవమన్నట్లు చెప్పారని నేను భావించుకుని, (అపుడు అమ్మగారు ఒంగోలుకి వచ్చారని తెలిసింది) ఒంగోలుకి వెళ్లి పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం చేసుకున్నాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు మా క్షేమసమాచారాలు అడుగుతూ, "సత్సంగాలు చేసుకుంటారా?" అని అడిగారు. "చేసుకుంటాం అమ్మగారూ, కానీ ఈమధ్య ఎవరూ రావటం లేదని మానేసాను" అన్నాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "అదేమిటి, వాళ్లిద్దరూ వస్తారుగా (బాబా, మాస్టరుగారు), ఎవరు వచ్చినా రాకపోయినా సత్సంగం చేసుకోవాలి" అని చెప్పారు. ఇంటికి వచ్చాక పూజ్యశ్రీ అమ్మగారు చెప్పినట్లు సత్సంగాలు ప్రారంభించాము. నెమ్మది నెమ్మదిగా జనం రావడం మొదలుపెట్టారు. ఇప్పటికీ ఏవిధమైన ఆటంకాలు లేకుండా సత్సంగాలు జరుగుతున్నాయి.

నాకు మనసులో ఒకలీల మెదులుతూ వుండేది. పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడి వెళ్ళినప్పుడు, తనదగ్గరున్న డబ్బంతా దానం చేసి, సాయిబాబా ఎలా కాపాడతారో చూద్దామని భావించి శిరిడీలో గడపడం అస్తమానం గుర్తొచ్చి, అదెంత కష్టమో కదా అనుకునేదాన్ని. ఒకసారి మా తమ్ముడు, మరదలితో కలిసి నేను పిల్లలు, శిరిడి వెళ్ళాము. నేను పర్సు, మా మరదలు హ్యాండ్ బాగ్ పట్టుకుని ద్వారకామాయికి వెళ్ళాము. ఇవి రెండూ పక్కన పెట్టి, పల్లకిని అలంకరించే సేవ చేస్తున్నాము. తిరిగి బసకి వచ్చాక చూసుకుంటే, నా పర్సులో డబ్బులు పోయాయి, మా మరదలి బాగ్ లో కూడా, కేవలం ఖర్చు కోసం వుంచుకున్న డబ్బులు మాత్రమే పోయాయి. పక్క అరలో, బాబాకి వేద్దామని వెయ్యిన్నూట పదహార్లు పెడితే, అవి అలాగే వున్నాయి. ఇంకొక అరలో, ఊరికి వెళ్ళడానికి టిక్కెట్లు ఉంటే, అవికూడా పోలేదు. మా తమ్ముడి దగ్గర, మా పిల్లల దగ్గర వున్న బహుకొద్ది డబ్బుతో, సంస్థానం వాళ్లు పెట్టే ప్రసాదం తింటూ 4 రోజులు గడిపాము. ఆయనకని హుండీలో వేసే డబ్బులు పోలేదు కనుక వాటిని వెంటనే హుండీలో వేసేసాము. తిరుగు ప్రయాణానికి టిక్కెట్లు ఉండడం వల్ల, క్షేమంగా ఇల్లు చేరాము. పూజ్యశ్రీ మాస్టరుగారు, మాచేత కూడా ఆ సాధన చేయించినందుకు చాలా సంతోషపడ్డాము. పూజ్యశ్రీ మాస్టరుగారు అలా చేసిన రోజుల్లో, ఈ మాత్రం వసతులు కూడా వున్నాయని నేననుకోవటం లేదు. ఆయన ముందు మేమెంత? కానీ నాకు ఆ స్ఫురణనిచ్చి అటువంటి అనుభవాన్ని మాకు ప్రసాదించినందుకు, చాలా ఆనందపడ్డాము.

కేవలం పూజ్యశ్రీ మాస్టరుగారి సత్సంగాల వల్ల, ధైర్యాన్ని పుంజుకుని పిల్లలని పెంచాను. వారి అనుగ్రహంతో పిల్లలిద్దరూ ఉద్యోగాలు వచ్చి పెళ్లిళ్లయ్యి, జీవితంలో స్థిరపడ్డారు. ఈ జీవితమంతా వారి దయే! పూజ్యశ్రీ మాస్టరుగారి పట్ల, నాకు కృతజ్ఞత, విశ్వాసం, ఎల్లప్పుడూ కలిగివుండేలా అనుగ్రహించమని సమర్థ సద్గురు సాయినాథుని ప్రార్థిస్తూ, గురుదంపతుల ఆశీస్సులను సదా కోరుకుంటూ అనేక వందన సహస్రాలు సమర్పించుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!!

ద్వారకామాయి అనుభవ మండపము

03వ పేజీ తరువాయి

పంపించారనిపించింది.

శిరిడి యాత్ర నుంచి వచ్చాక నాలో చాలా మార్పు వచ్చింది. అయితే ఆయన నా భవిష్యత్తు గురించి చెప్పిన విషయాల్లో సినిమాల వైపు వెళ్లొద్దని చెప్పినా, దర్శకత్వం చెయ్యాలన్న ప్రలోభానికి గురై, ఆ పని చేసి, ఆయన చెప్పినట్లే మోసానికి గురయ్యి బైటికి వచ్చాను.

నా చదువు పూర్తైన తరవాత ఒక సంవత్సరం ఖాళీగా వున్నాను. ఈలోపు కరోనా వచ్చింది. ఆ సమయంలో నాకు బాబాని సేవించుకోవడానికి ఎక్కువ అవకాశం కలిగింది. నాకు నాగర్ సోల్ స్టేషన్ లో 'ఆయన' రూపంలో సాయిబాబా చేసిన బోధ ఆలోచించుకోవడానికి సమయం దొరికింది. అప్పుడు మా అమ్మకి కొంచం అనారోగ్యం చేస్తే,'ఆయన' చెప్పినట్లు అమ్మకి అన్ని సేవలు నేనే చేసాను.

నాకు చిన్నప్పటినించి చిత్రలేఖనం, ఛాయాచిత్రకళ మీద మక్కువ ఎక్కువ. అందువల్ల ఖాళీసమయాల్లో వాటిమీద దృష్టి పెట్టేవాడిని. అయితే చిత్రలేఖనం పెన్సిల్ ఉపయోగించి కాకుండా డిజిటల్ గా చెయ్యాలని అభ్యాసం చేసాను. బాబాగారి దయవల్ల, నేను చాలా చిత్రాలు వెయ్యడం, అవి బాగున్నాయని నన్ను చాలామంది అభినందించి, నాచేత డిజిటల్ వర్క్ చేయించుకోవడం జరిగింది. దానితో, భయాందోళనలతో గడపాల్సిన సమయం నాకు ఆర్థికాభివృద్ధితో పాటు ఆనందాన్ని కూడా కలిగించింది. ఇప్పుడు నాకు 25 సంవత్సరాలు. నాలుగు సంవత్సరాల క్రితం శిరిడి వెళ్ళినప్పటినించి, నాకు అనేక సందేశాలిస్తూ, సమస్యలు పరిష్కరిస్తూ, ప్రతిక్షణం నాతోనే వున్నారన్న భావన కలిగిస్తున్న షిరిడీసాయినాథుల వారికి కృతజ్ఞతాపూర్వక నమస్సులు!

సమర్థ సద్గురు సాయినాథ మహారాజ్ కి జై!!

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

SRI GURUPADUKA PUBLICATIONS, C/o.SRI MANGA BHARADWAJA TRUST

Regd.Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68.
Phone: +91 - 74160 41550

Branch Office : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh.
Phone:08592 233271

Send DD in favour of **"Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad or Ongole.**

శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర (Bound)	450-00
శ్రీ సాయి లీలామృతం	150-00
శ్రీ గురు చరిత్ర	150-00
శ్రీ సాయి సన్నిధి	120-00
శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు	125-00
శ్రీ సాయినాథ ప్రభోధామృతము	80-00
సాయినాథ పూజ	40-00
సాయినాథ స్థవనమంజరి	10-00
శిరిడి ఆరతులు	15-00
సాయిబాబాను సేవించడమెందుకు	10-00
సత్సంగము - భజన	5-00
శిరిడి క్షేత్ర సందర్శనము	40-00
విజ్ఞాన వీచికలు	99-00
పరిప్రశ్న	99-00
మతమెందుకు?	20-00
ఏది నిజం?	25-00
ధ్యానయోగ సర్వస్వం	99-00
బుద్ధధ్యాన హృదయం	49-00
దత్తావతార మహత్త్వం	75-00
సంహితాయన గురు ద్విసాహస్రి	125-00
పురుషసూక్త రహస్యం	40-00
సాయిసూక్తి - ఆచార్యవాణి	10-00
శ్రీ పాకలపాటి గురువుగారు	49-00
అవధూత శ్రీ చీరాలస్వామి	49-00
అవధూత శ్రీ వెంకయ్యస్వామి	70-00
శ్రీ ఆనందమాయి అమ్మ	49-00
టిబెట్ యోగి మిలారేపా చరిత్ర	80-00
శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర	49-00
స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి)	49-00
మనము - మన సంస్కృతి	70-00

ఇతర ప్రచురణలు

మహాత్ముల ముద్దుబిడ్డడు	120-00
అవధూత చివటం అమ్మ	70-00
శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర	70-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-1	125-00
మరో నందదీపం	80-00
ఆచార్య అమృత లేఖావళి	40-00
భగవాన్ శ్రీ భరద్వాజ	175-00
బాలల శ్రీ సాయి లీలామృతము	25-00
మహాపురుషుడు	50-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-2	125-00
బాలల శ్రీ సాయి సన్నిధి	50-00
బాలల శ్రీ గురు చరిత్ర	50-00
శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము	15-00
మాష్టారు అమృత వాక్కులు	100-00

BOOKS IN ENGLISH

Sai Baba the Master	175-00
Sree Guru Charitra	99-00
Supreme Master (Swami Samartha)	99-00
Sai Baba of Shiridi and His Teachings	99-00
Life and Teachings of Hazarat Tajuddin Baba	99-00
Children's Sai Baba the Master	60-00

BOOKS IN OTHER LANGUAGES

Sadguru Sai Baba (Hindi)	150-00
Sai Leelamrutham (Kannada)	150-00
Sai Baba Jeevitha Charitham (Malayalam)	220-00
Sai Baba Leelamrutham (Tamil)	175-00
Sri Guru Charitra (Hindi)	99-00
Swami Samartha (Kannada)	50-00
Sri Guru Charitra (Kannada)	99-00
Shiridi Aarathi (Tamil)	15-00
Stavana Manjari (Tamil)	10-00
Tibet Yogi Milarepa Jeevitha Charitra (Kannada)	55-00
Sri Sainath Prabodhamruthamu (Kannada)	65-00
Sai Sannidhi (Kannada)	120-00
Sri Guru Charitra (Malayalam)	150-00
Sri Guru Charitra (Oriya)	150-00

శ్రీ మంగ భరద్వాజ నిత్య నివాస క్షేత్రం, నాగోలు (హైదరాబాద్)



శ్రీ గురు భరద్వాజ తపోవనం, విద్యానగర్

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.

మాతృదేవి దివ్య సన్నిధి, గుమ్మళంపాడు

పూజ్య ఆచార్య శ్రీ భరద్వాజ మాస్టరుగారి జన్మదినోత్సవ వేడుకలు ఒంగోలు మంగమూరు డొంక సాయిబాబా మందిరంలో గల 'శ్రీ భరద్వాజ బృందావనం' వద్దను, విద్యానగర్ లోని 'శ్రీ గురు భరద్వాజ తపోవనం' లోను, గుమ్మళంపాడు గ్రామ శివారులో నెలకొనివున్న 'మాతృదేవి దివ్య సన్నిధి' లోను, హైదరాబాదు (నాగోలు) లో 'శ్రీ మంగ భరద్వాజ నిత్య నివాస క్షేత్రం'లోను అక్టోబర్ 30, 2022న ఘనంగా జరిగాయి.

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.